

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## కబ్జాకోరులకు భూమి రాసిచ్చారు

- ప్రజావినతుల్లో ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన మంత్రి కొండపల్లి

6

9552300009

# ‘మన మిత్ర’

## వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్

- ప్రజల చేతిలోనే ప్రభుత్వం, ప్రజల చేతిలో పాలన, మాది ప్రజా ప్రభుత్వం
- ప్రభుత్వం, ప్రజల మధ్య వారధి వాట్సప్ గవర్నెన్స్
- ధృవపత్రాల కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదనే..
- మొదటి విడతలో అందుబాటులోకి 161 రకాల పౌర సేవలు
- తరువాతి దశలో మరో 360 పౌర సేవలు
- పాదయాత్ర హామీని నిలబెట్టుకున్నా

3




N Chandrababu Naidu
@ncbn
1995 - E-Governance
2025 - WhatsApp Governance
9552300009
#WhatsAppGovernanceInAP

*రాష్ట్రంలో గురువారం నుంచి వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ వేదికపై చేసిన ఆసక్తికరమైన ట్వీట్..*

**1995 ఈ-గవర్నెన్స్.. 2025 వాట్సాప్ గవర్నెన్స్**

# ఇదీ పెట్టుబడుల ‘పవర్’!



- రూ.44,776 కోట్లతో 15 ప్రాజెక్టులకు ఆమోదం
- 19,580 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పన
- సీఎం అధ్యక్షతన 3వ ఎస్ఐపీబీ సమావేశం
- 3 నెలల్లో అర్సెల్లార్, బీపీసీఎల్ ప్రాజెక్టుల శంకుస్థాపన
- త్వరితగతిన గ్రౌండ్ అయ్యేలా అధికారులు ట్రాక్ చేయాలి
- డిపి వరల్డ్, ఏపీ ముల్లర్ మార్స్క్‌తో సంప్రదింపులు జరపాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

2

## దేశంలోనే తొలిసారి..

### వాట్సాప్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు ట్వీట్



అమరావతి (చైతన్య రథం): వాట్సాప్ గవర్నెన్స్‌పై సీఎం నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కీలక ట్వీట్ చేశారు. ‘రాష్ట్ర ప్రజలకు ‘మన మిత్ర’ పథకాన్ని అంకితం చేశాం. 161 సేవలు అందజేసే ‘మన మిత్ర’ ప్రక్రియ ఓ మైలురాయి. నారా లోకేష్ ఆలోచనతో ‘మన మిత్ర’ రూపొందించారు. ప్రజలకు సేవ చేయాలనే తపన ‘మన మిత్ర’లో ప్రతిబింబిస్తుంది. దేశంలోనే ప్రథమంగా ఈ తరహా సేవలు అందుబాటులోకి తెచ్చాం. లోకేష్, మెటా భారత ఉపాధ్యక్షులు సంధ్యా దేవనాథన్‌కు అభినందనలు’ అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వాట్సాప్ సేవలను గురువారం ఏపీ ప్రభుత్వం ప్రారంభించింది. మొదటి విడతలో 161 సేవలను వాట్సాప్ ద్వారా అందించనుంది. తొలి విడతలో దేవాదాయ, విద్యుత్ శాఖ, ఆర్టీసీ, రెవెన్యూ, అన్నా క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖల్లో ఈ సేవలను ఏపీ ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

### నేడు పెనుగొండ పర్యటన

ఇదిలావుంటే, నేడు పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం ఆలయాన్ని సందర్శించి.. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అమ్మవారికి పూజలు నిర్వహించి.. వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించనున్నారు.

### నేడు పొలిట్‌బ్యూరో భేటీ

టీడీపీ జాతీయాధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం పొలిట్‌బ్యూరో భేటీ కానుంది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం మధ్యాహ్నం పొలిట్‌బ్యూరో సమావేశమవుతోంది. పార్టీ సంస్థాగత వ్యవహారాలు, కోటిదాటిన సభ్యత్వాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఫిబ్రవరి నుంచి పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ రూపొందించే అవకాశం లేకపోలేదని పార్టీ సీనియర్లు చెబుతున్నారు. అలాగే, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపైనా ఒక ప్రణాళిక రూపొందించవచ్చుని.. పార్టీ నిర్మాణ పటిష్టతపైనా చర్చించే అవకాశం లేకపోలేదని అంటున్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# భారీ మెజారిటీతో గెలవాలి



- జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రుల సమావేశంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ దిశానిర్దేశం
- సాధారణ ఎన్నికల మాదిరిగానే వీటినీ ప్రతిష్టాత్మంగా చూడాలి
- ఏడు నెలల అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టభద్రులకు వివరించాలి
- తీసుకొచ్చిన పెట్టుబడులు, రాబోతున్న ఉద్యోగ అవకాశాలపై ప్రచారం చేయాలి

4

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉండదు

- కేంద్ర మంత్రి కుమారస్వామి స్పష్టీకరణ
- ప్లాంట్ పరిరక్షణపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పలుమార్లు మాట్లాడారు
- ప్లాంట్‌పై ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ
- 2030లోపు 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి లక్ష్యం



5

## జగన్‌ను మించిన అవినీతిపరుడు పెద్దిరెడ్డి

- పుంగనూరు ఓటర్ల కన్నా ఆయన పాపాల జాబితా పెద్దది
- ఆయన చిట్టా మొత్తం బయటపెడతాం
- శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ

7

## ప్రజల సొమ్ము దోచుకున్న గజదొంగ పెద్దిరెడ్డి

- త్వరలోనే అక్రమాలన్నీ బయటకి
- మళ్లీ అధికారంపై పెద్దిరెడ్డి పగటి కలలు
- మంత్రి మండిపల్లి స్పష్టీకరణ

8

# ఇదీ పెట్టుబడుల 'పవర్'!

## రూ.44,776 కోట్లతో 15 ప్రాజెక్టులకు ఆమోదం - 19,580 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పన

### సీఎం చంద్రబాబు అధ్యక్షతన 3వ ఎస్ఐపీబీ సమావేశం

- 3 నెలల్లో అర్సెల్లార్, బీపీసీఎల్ ప్రాజెక్టుల శంకుస్థాపన
- త్వరితగతిన గ్రౌండ్ అయ్యేలా అధికారులు ట్రాక్ చేయాలి
- డిపి వరల్డ్, ఏపీ ముల్లర్ మార్క్స్‌తో సంప్రదింపులు జరపాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో పెట్టుబడులపై కూటమి ప్రభుత్వ ప్రయత్నాలు మంచి ఫలితాలిస్తున్నాయి. వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో గురువారం జరిగిన స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డ్ మూడో సమావేశంలో 15 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. దీంతో ఎస్ఐపిబీ ఇప్పటివరకు ఆమోదం తెలిపిన పెట్టుబడుల విలువ రూ.3 లక్షల కోట్లు దాటాయి. వీటితోపాటు అర్సెల్లార్ మిట్టల్, ఎన్టీపీసీ, హెచ్‌పిసిఎల్, బీపీసీఎల్ వంటి సంస్థల పెట్టుబడులకు ఇప్పటికే లైన్‌క్లియర్ అయ్యింది. రూ.1.36 లక్షల కోట్లతో ఏర్పాటయ్యే అర్సెల్లార్ మిట్టల్ స్టీల్ పరిశ్రమకు, రూ. 96వేల కోట్లతో ఏర్పాటయ్యే బీపీసీఎల్ వంటి ప్రాజెక్టులకు మరో మూడు నెలల్లో శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు అన్ని అనుమతులు పూర్తిచేసి ప్రాజెక్టులను గ్రౌండ్ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

**7 నెలల్లో మూడుసార్లు ఎస్ఐపీబీ సమావేశం**

రాష్ట్ర ప్రభుత్వం గడిచిన 7 నెలల కాలంలో తెచ్చిన పాలసీలు, అందిస్తున్న సహకారంతో పెట్టుబడుల రాక ఆశాజనకంగా సాగుతోంది. మొదటి ఎస్ఐపీబీ సమావేశంలో రూ.83,987 కోట్లు, రెండో ఎస్ఐపీబీలో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గురువారం జరిగిన మూడవ ఎస్ఐపీబీ సమావేశంలో మరో రూ.44,776 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. నేడు ఆమోదం పొందిన 15 ప్రాజెక్టుల ద్వారా రూ.19,580 మందికి ఉపాధి లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు రూ.3,10,925 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. వీటిద్వారా 3,12,576 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి.

**ప్రాజెక్టుల పురోగతిపైనా సమీక్ష**

పెట్టుబడులు త్వరితగతిన కార్యరూపం దాల్చేలా అధికారులు ట్రాకింగ్ చేయాలని సమావేశంలో అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. రూ.10 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టే ప్రతి ప్రాజెక్టు పురోగతినీ తప్పనిసరిగా ట్రాకింగ్ చేయాలని ఆదేశించారు. గత రెండు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం తెలిపిన ప్రాజెక్టుల పురోగతిపైనా గరువారంనాటి సమావేశంలో చర్చించారు. ఒప్పందాలపై పరిశ్రమల యాజమాన్యాలతో నిరంతరం చర్చలు జరుపుతూ సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. అధికారులు, మంత్రులు పెట్టుబడులను ట్రాక్ చేయడం ద్వారా త్వరితగతిన ఫలితాలు చూపించాలన్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న నేటి పరిస్థితుల్లో ఫలితాలు రావాలంటే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అమలు చేసి చూపాలని అధికారులకు సూచించారు. రాష్ట్రస్థాయిలో అనుమతులు, క్షేత్రస్థాయిలో పనులపై కలెక్టర్లతో సమీక్ష జరపాలని ప్రధాన కార్యదర్శికి సీఎం సూచించారు. పెట్టుబడులపై దిగ్గజ సంస్థలు, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల నుంచి వస్తున్న స్పందన సంతృప్తికరంగా ఉందన్నారు. దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపించిన దుబాయ్‌కు చెందిన డిపి వరల్డ్, డెన్మార్క్‌కు చెందిన ఏపీ ముల్లర్–మార్క్స్‌వంటి సంస్థలతో సంప్రదింపులు జరిపి, సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి అవకాశాన్నీ రాష్ట్రానికి పెట్టుబడులు సాధించేందుకు ఉపయోగించుకోవాలన్నారు. పర్యాటక ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని... ఈ రంగంలో 20శాతం వృద్ధి సాధించాలని చెప్పారు.

**తాజా పెట్టుబడుల వివరాలు**

ఎస్ఐపీబీ మూడో సమావేశంలో ఆమోదం తెలిపిన 15 ప్రాజెక్టులు.. పునరుత్పాదక విద్యుత్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రానున్నాయి.

**నవయుగ ఇంజినీరింగ్**

అల్లూరి సీతారామరాజు జిల్లా గుజ్జిలిలో 1,500 మెగావాట్లతో, చిత్తంవలసలో 800 మెగావాట్ల ప్రాజెక్టును నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ రూ.14,328 కోట్లతో ఏర్పాటు చేస్తోంది. 3,450మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**మేఘా ఇంజినీరింగ్**

అన్నమయ్య జిల్లా కొమ్మూరులో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ రూ.10,300 కోట్లతో 3,000 మందికి ఉపాధి కలిగేలా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును నెలకొల్పనుంది.

**యాస్పరి**

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 118.8 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు యాస్పరి రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆసక్తి కనబరించింది. ఈ ప్రాజెక్టు రాకతో 150 మందికి ఉపాధి లభిస్తుంది.

**అనంతపూర్ రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్**

అనంతపురంలో 178.20 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును అనంతపూర్ రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.972.23 కోట్లతో 225మందికి ఉపాధి కలిగించేలా ఏర్పాటు చేయనుంది.

**కడప రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్**

శ్రీసత్య సాయి జిల్లాలో కడప రెన్యూవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,163.11 కోట్లతో 300 మందికి ఉపాధి కలిగేలా 231 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు నెలకొల్పనుంది.

**ఎకోరెన్ ఎనర్జీ ఇండియా**

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ 201.30 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును రూ.1,651 కోట్లతో నిర్మించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 255 మందికి ఉపాధి దొరకనుంది.

**అయానా పవర్**

ఎకోరెన్ లిమిటెడ్ నుంచి అయానా రెన్యూవబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.4,435 కోట్లతో కర్నూలు జిల్లాలో పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. 498.30 మెగావాట్ల సామర్థ్యంతో నెలకొల్పే పవర్ ప్లాంటుతో 630మందికి ఉపాధి దక్కనుంది.

**ఆంపిన్ ఎనర్జీ**

ఎకోరెన్ లిమిటెడ్‌నుంచి ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రైవేట్ లిమిటెడ్ కర్నూలు, నంద్యాలలో రూ.3,142 కోట్లతో 350 మెగావాట్ల సామర్థ్యమున్న పవన–సౌర విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పనుంది. 1,200 మందికి ఉపాధి కలుగుతుంది.

**ఎస్ఏఈఎల్**

ఒకొక్కటి 300 మెగావాట్ల సామర్థ్యంతో మొత్తం 600 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు ఎస్ఏఈఎల్ సోలార్ ఏర్పాటు చేస్తోంది. రూ. 3,456 కోట్లతో 2,070 మందికి ఉపాధి కలిగేలా అనంతపురం, కడప, నంద్యాలలో ప్లాంట్లను నెలకొల్పనుంది.

**టాటా పవర్**

అనంతపురంలో 400 మెగావాట్ల సామర్థ్యంతో రూ.2,000 కోట్ల వ్యయంతో సౌర విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పనుంది. ఈ కేంద్రం ద్వారా 1,380 మందికి ఉపాధి లభిస్తుంది.

**ఎన్ఎస్ఎల్ రెన్యూవబుల్ సీపీపీ**

ఎకోరెన్ నుంచి ఎన్ఎస్ఎల్ రెన్యూవబుల్ సీపీపీ ప్రైవేట్ లిమిటెడ్ 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విండ్, సోలార్ హైబ్రిడ్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. దీనికి రూ.567 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. 170 మందికి ఉపాధి కలుగుతుంది.

**కోరమండల్**

కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ రూ.1,539 కోట్లతో కాకినాడ జిల్లాలో తమ ఫెర్టిలైజర్ ప్లాంటును విస్తరించేందుకు పెట్టుబడులు పెట్టేందుకు తాజాగా ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్లాంటు ఏర్పాటు ద్వారా 750 మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి.

**అలెప్, ఈఎంసీ కొప్పర్తి**

కోడూరులో 6 వేలమందికి ఉపాధి కల్పించేలా రూ.305 కోట్లతో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలెప్) ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టనుంది. అలాగే ఈఎంసీ కొప్పర్తి కడప జిల్లాలో కూడా ఇదే రంగంలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న సంస్థల్ని సమన్వయం చేసుకుంటూ, త్వరితగతిన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా చేసేందుకు కన్వీనర్‌ను నియమించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జిల్లాలో కలెక్టర్ స్థాయినుంచి రాష్ట్రంలో పైస్థాయి అధికారుల వరకు త్వరగా అనుమతులు వచ్చేలా, క్షేత్రస్థాయిలో తలెత్తే అవరోధాలను అధిగమించేలా కన్వీనర్‌కు బాధ్యత అప్పగించాలని సూచించారు.



# ‘మన మిత్ర’

## ప్రజల చేతిలోనే ప్రభుత్వం, ప్రజల చేతిలో పాలన, మాది ప్రజా ప్రభుత్వం

## వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

- ప్రభుత్వం, ప్రజల మధ్య వారధి వాట్సప్ గవర్నెన్స్
- ధృవపత్రాల కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదనే
- మొదటి విడతలో అందుబాటులోకి 161 రకాల పౌర సేవలు
- తరువాతి దశలో మరో 360 పౌర సేవలు
- పాదయాత్ర హామీని నిలబెట్టుకున్నా






అమరావతి (చైతన్యరథం): ప్రజల చేతిలోనే ప్రభుత్వం, ప్రజల చేతిలో పాలన, మాది ప్రజా ప్రభుత్వం అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. ప్రజలు ధృవపత్రాలు, ఇతర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా పౌర సేవలను వేగవంతంగా అందజేసేందుకు వాట్సప్ గవర్నెన్స్‌కు కూటమి ప్రభుత్వం నాంది పలికింది. దేశంలో తొలిసారిగా ‘మన మిత్ర’ పేరుతో ఏపీ ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టింది. ఈ సేవలను ఉండవల్లిలోని నివాసంలో మంత్రి నారా లోకేష్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. దీనికోసం అధికారిక వాట్సప్ నెంబర్ 9552300009 ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. యువగళం పేరుతో 3,132 కి.మీల పాదయాత్ర చేశానన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ఆలోచన యువగళం పాదయాత్ర నుంచి మొదలైంది. నా ప్రసంగాలు చూస్తే మీకు అర్థమవుతుంది. ఒక బటన్ నొక్కితే సినిమా చూస్తున్నాం, భోజనం వస్తోంది, క్యాబ్ వస్తుంది, ఒక బటన్ నొక్కితే ప్రభుత్వం ఎందుకు ప్రజల వద్దకు రాదనే ప్రశ్న ఉత్పన్నమైంది. ఆ ఛాలెంజ్‌ను నేను స్వీకరిస్తున్నాని ఆనాడు చెప్పా. అందుకే ‘మన మిత్ర’ ప్రజల చేతిలోనే ప్రభుత్వం, ప్రజల చేతిలో పాలన, మాది ప్రజాప్రభుత్వం నినాదంతో వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రారంభిస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

### మొదటి విడతలో అందుబాటులోకి 161 రకాల పౌర సేవలు

వాట్సప్ గవర్నెన్స్‌కు 36 శాఖలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఇది చాలా క్లిష్టతరమైన పని. మొదటి విడతలో 161 పౌర సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నాం. రెండో విడతలో 360 పౌర సేవలు ప్రారంభిస్తాం. ప్రభుత్వం, ప్రజల మధ్య వారధి వాట్సప్ గవర్నెన్స్. రియల్ టైంలో ధృవపత్రాలు అందించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుంది. సర్టిఫికెట్లు అందజేసినప్పుడు వాటిపై ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఆ క్యూర్ కోడ్ స్కాన్ చేస్తే ఏపీ గవర్నమెంట్ వెబ్ సైట్‌కు ఆ లింక్ వెళ్తుంది. దీంతో నకిలీ సర్టిఫికెట్లకు ఆస్కారం ఉండదు. బ్లాక్ చైన్ టెక్నాలజీ కూడా త్వరలోనే తీసుకురావాలని మేము నిర్ణయం తీసుకున్నాం. ఇప్పుడు నెంబర్ సెలెక్షన్ ద్వారా రెవెన్యూ, మున్సిపల్, ఎండోమెంట్ సర్వీసులతో పాటు అనేక సర్వీసులు తీసుకువచ్చాం. రెండో దశలో ఏఐ బాట్, వాయిస్ ద్వారా కూడా అమలుచేస్తాం. ప్రపంచంలోనే వాట్సప్ గవర్నెన్స్ అమలు చేస్తున్న తొలి రాష్ట్రం మనది. దీనికి మరింత మెరుగులు దిద్దాల్సిన అవసరం ఉంది. ఇంకా నేర్చుకోవాల్సినవి చాలా ఉన్నాయి. లోటుపాట్లు సరిచేసుకుని మరింత మెరుగ్గా దీనిని తీర్చిదిద్దుతాం. రియల్ టైం గవర్నెన్స్ లో కూడా అన్ని శాఖల నుంచి సమాచారాన్ని తీసుకుని క్రోడీకరిస్తున్నాం. డేటా లేక్ క్రియేట్ చేసి సీమ్ లెస్ సర్వీసెస్ అందిస్తాం. గత మూడు నెలలుగా మా టీం అహర్నిశలు కష్టపడ్డారు. గత 15 రోజులుగా టెస్టింగ్ చేస్తున్నాం. ఇంకా మెరుగులు దిద్దాలని నాకు అర్థమైంది. ఇదొక ప్రయాణం. ఆరు నెలల్లో ఐడియల్ ప్రొడక్ట్‌గా తీర్చిదిద్దుతాం. అన్ని సేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. పాదయాత్ర హామీని నిలబెట్టుకున్నా. ఆరు నెలల్లో ఎంతమార్పు వస్తుందో ప్రజలే చూస్తారని మంత్రి లోకేష్ విశ్వాసం వ్యక్తం చేశారు.



### సులభంగా వినయోగించేలా: మెటా ఇండియా హెడ్ సంధ్య

మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్, హెడ్ సంధ్య దేవనాథన్ మాట్లాడుతూ.. ఈ రోజు మీ మధ్య ఉండటం చాలా ఆనందంగా ఉందన్నారు. మన మిత్ర వాట్సప్ సేవలు ప్రారంభిస్తున్నాం, ప్రతి ఒక్కరి జీవితంలో వాట్సప్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. మన మిత్ర ద్వారా 161 పౌర సేవలను ప్రతి ఒక్కరికి అందిస్తాం. ప్రజలు సులభంగా వినియోగించేలా వాట్సప్ గవర్నెన్స్‌ను రూపొందించాం. వాట్సప్ గవర్నెన్స్ సేవల కోసం చాలా కృషిచేశామన్నారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి మన మిత్రను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని చెప్పారు.

### మరింత మెరుగ్గా: వాట్సప్ ఇండియా హెడ్ రవి గార్గ్

వాట్సప్ డైరెక్టర్, ఇండియా హెడ్ రవి గార్గ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. అయితే సింగిల్ ప్లాట్ ఫామ్ పై అన్ని రకాల సేవలు అందించడం ఎక్కడా లేదు. మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌ను మరింత అభివృద్ధి చేసి మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. హాయ్ అని టైప్ చేయడం ద్వారా ప్రజలు సులభంగా పౌరసేవలను పొందవచ్చని అన్నారు. ప్రస్తుతం 161 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, ఆర్టీజీఎస్ సీఈవో కే.దినేష్ తదితరులు పాల్గొన్నారు.

### ధృవపత్రాల కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదనే..

యువగళం పాదయాత్రలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం కలిగింది. ఉదయం బస్సు దిగి పాదయాత్ర ప్రారంభించినప్పటి నుంచి మళ్లీ తిరిగి బస్సు ఎక్కేవరకు ప్రజలతో, కార్యకర్తలతో, నాయకులతో ఉండి వారి సమస్యలు విన్నా. రైతులు, మహిళలు, విద్యార్థులు, కులవృత్తుల వారిని కలిశాను. వారంతా ఒక్కటే అడిగారు.. కుల ధృవీకరణ పత్రం ఇన్నిసార్లు ఎందుకు తీసుకోవాలి అని. ఆదాయ ధృవపత్రం కోసం మళ్లీ మళ్లీ అధికారుల వద్దకు ఎందుకు వెళ్లాలని అడిగారు. విద్యుత్ బిల్లు చెల్లించాలంటే ఎందుకు సీమ్ లెస్‌గా చెల్లించలేకపోతున్నాం? బస్సు ఎక్కిన తర్వాతే ఎందుకు టికెట్ తీసుకోవాలి? ముందే తీసుకోకూడదా అని పదేపదే నన్ను అడిగారు. గత ఐదేళ్ల పాలనలో సర్టిఫికెట్లు రానివ్వకుండా చేశారు. దుగ్గిరాల మండలంలో ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసిన టీడీపీ అభ్యర్థికి నాటి ప్రభుత్వం కావాలనే ధృవపత్రం ఇవ్వలేదు. వ్యవస్థలో లోపాలను సరిచేయాలని భావించా. ధృవపత్రాల కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదు అనే ఆలోచన మొదలైంది. ప్రతి ఇంట్లో, జేబులో స్మార్ట్ ఫోన్ ఉంది. 60శాత ంమందికి స్మార్ట్ ఫోన్ ఉంది. వారంతా వాట్సప్ ఇన్ స్టాల్ చేసుకుంటారు. వాట్సప్‌తో వర్క్ చేయాలని యువగళం పాదయాత్ర సమయంలోనే అనుకున్నా. దీంతో మెటా ఇండియా హెడ్ సంధ్యని కలిసి మాట్లాడం జరిగింది. ప్రపంచంలో ఎక్కడా ఇన్ని సేవలు ఒకే ప్లాట్‌ఫాం ద్వారా తీసుకురాలేదు. ప్రభుత్వ పరంగా కూడా ఎక్కడా లేదు. మీరు చేయగలుగుతారా అని అడిగారు. గతేడాది అక్టోబర్ 22న ఢిల్లీలో మెటా సంస్థతో ఒప్పందం చేసుకున్నాం. ఆ రోజు నేను ఛాలెంజ్‌ను స్వీకరించాను. డిసెంబర్ నాటికి ప్రారంభిస్తామని చెప్పాను. ఎంవోయూ జరిగిన మూడు నెలల 9 రోజుల తర్వాత ప్రారంభిస్తున్నామని మంత్రి లోకేష్ వివరించారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# భారీ మెజారిటీతో గెలవాలి

### జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రుల సమావేశంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ దిశానిర్దేశం

- **సాధారణ ఎన్నికల మాదిరిగానే వీటినీ ప్రతిష్టాత్మంగా చూడాలి**
- **ఏడు నెలల అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టభద్రులకు వివరించాలి**
- **తీసుకొొచ్చిన పెట్టుబడులు, రాబోతున్న ఉద్యోగ అవకాశాలపై ప్రచారం చేయాలి**
- **మెగా డీఎస్సీ ప్రకటన, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులు, టీచర్ల సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు తెలియజేయాలి**



అమరావతి (చైతన్యరథం): త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించేలా ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, నాయకులు కృషి చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు ఇచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయిన నేపథ్యంలో సంబంధిత జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులతో గురువారం నారా లోకేష్ సమావేశమై పార్టీ అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై మార్గనిర్దేశం చేశారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజా, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ఇన్‌ఛార్జి మంత్రులు పూర్తి బాధ్యత తీసుకోవాలని నారా లోకేష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 2023లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను లోకేష్ గుర్తుచేశారు. అప్పుడు టీడీపీ గెలిచిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేశాయని, సాధారణ ఎన్నికలో సాధించిన ఘన విజయానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విజయం నాంది అయిందన్నారు. అప్పుడు 8 నెలల ముందే అభ్యర్థులను ఖరారు చేయడం, ప్రతి వారం అభ్యర్థులు, పార్టీలో ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించిన విషయాన్ని మంత్రులకు వివరించారు. సాధారణ ఎన్నికలను ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నమో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా అంతే సీరియస్‌గా తీసుకోవాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు.

**అభివృద్ధిని వివరించాలి**

ప్రతి ఓటరును పార్టీ శ్రేణులు నేరుగా కలవాలి, సోషల్ మీడియాను పెద్ద ఎత్తున వినియోగించుకోవాలి, పట్టణ ప్రాంతాల్లో ఉండే పట్టభద్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని లోకేష్ సూచించారు. జగన్ రెడ్డి పాలనలో అప్పుల ఊబిగా మారిన రాష్ట్రాన్ని కేవలం 7 నెలల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా అభివృద్ధి బాట పట్టిస్తున్నారో ఓటర్లకు వివరించాలి. ఏడు నెలల్లోనే రూ. 6,33,568 కోట్ల పెట్టుబడులు తీసుకురావడం తద్వారా 4,10,125 మంది యువత రానున్న ఉద్యోగ అవకాశాల గురించి వివరించాలి. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలి. ఏడేళ్ల తరువాత ప్రజా ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులు, ఉన్నత విద్యను గాడిన పెట్టేందుకు వీసీల నియామకం, రిక్రూట్‌మెంట్, తదితర అంశాల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని లోకేష్ సూచించారు. ఇన్‌ఛార్జి మంత్రులందరూ సమావేశాలు ఏర్పాటు చేసుకుని పార్టీ యంత్రాంగాన్ని ఎన్నికల కోసం సన్నద్ధం చేయాలని లోకేష్ చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, గుమ్మిడి సంధ్యారాణి, పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

---

## టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధికి

# రూ.25 లక్షల విరాళం

**- యువనేత లోకేష్‌కు చెక్కు అందజేసిన జనచైతన్య శ్రేష్ఠ గ్రూప్స్ అధినేత మాదల చైతన్య**



అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి కోసం జనచైతన్య శ్రేష్ఠ గ్రూప్స్ అధినేత మాదల చైతన్య రూ. 25 లక్షలు చెక్కును అందజేశారు. ఉండవల్లిలోని నివాసంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌ను గురువారం మాదాల చైతన్య మర్యాదపూర్వకంగా కలిసి చెక్కును అందజేశారు. కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ఏకైక పార్టీ తెలుగుదేశం అని చైతన్య కొనియాడారు. అటువంటి పార్టీ ఖర్చుచేసే ప్రతీ పైసా కార్యకర్తల సంక్షేమానికి దోహదపడుతుందనే నమ్మకంతో తాను చెక్కును అందించానని చెప్పారు. పార్టీ మనకు ఏం ఇచ్చిందని కాకుండా పార్టీకి మనం ఏం ఇచ్చామనే ఆలోచనతో ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 74 ఏళ్ల వయసులో సైతం రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం నిరంతరం తపన పడుతున్న సీఎం చంద్రబాబుకు, లోకేష్‌కు తాము ఎప్పుడు అండగా ఉంటామన్నారు. అదే విధంగా ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా టీడీపీ అండగా ఉంటుందన్నారు.

---

# మహాత్ముని ఆశయసాధనకు కృషి చేద్దాం

**- మంత్రి లోకేష్ నివాళి**



*అమరావతి (చైతన్యరథం): సత్యం, అహింసలే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్యం సాధించిన జాతిపిత మహాత్మాగాంధీ వర్థంతి సందర్భంగా ఆ మహనీయునికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నివాళు లర్పించారు. అహింస అనే ఆయుధంతో సూర్యడస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి భరతమాత దాస్యశృంఖలాల నుంచి విముక్తి కలిగించిన మహెూన్నతుడు మహాత్మాగాంధీ అని మంత్రి లోకేష్ కొనియాడారు. 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన వ్యక్తుల్లో మహాత్మాగాంధీ ఒకరన్నారు. నమ్మిన సిద్ధాంతాలను గాంధీజీ స్వయంగా ఆచరించి చూపారు. భారతదేశంపై చెరగని ముద్ర వేశారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం కృషిచేద్దామని ఎక్స్ వేదికగా మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు. ఇటా ఉంటే ఉండవల్లి నివాసంలో మహాత్ముని చిత్రపటానికి పూల మాలలు వేసి మంత్రి లోకేష్ ఘనంగా నివాళులర్పించారు.*

---

# విశాఖ ఉక్కుపై మాట నిలబెట్టుకున్నారు

**- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కుమారస్వామికి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు**

అమరావతి (చైతన్యరథం): విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

విశాఖ ఉక్కు పునరుజ్జీవానికి నిధులు కేటాయించటంతో పాటు, ఉత్తరాంధ్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నేరవేరుస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

ప్రజల కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, ఈ అంశాల్లో నిబద్ధతతో పని చేస్తుందని ఎక్స్‌లో మంత్రి లోకేష్ ఉద్ఘాటించారు.



మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఉండవల్లి నివాసంలో మహాత్ముడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.



ఏపీ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్-2025 క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఏపీపీజెఏ సభ్యులు సీఎంను సచివాలయంలో కలిసి ఆయన చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. క్యాలెండర్‌లో పొందుపరిచిన ఫోటోలను సీఎం ఆసక్తిగా చూశారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన వారిలో ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు విజయ భాస్కర్, నారాయణ, మహేష్, ప్రశాంత్, సతీష్ ఉన్నారు.







మెటా ఇండియా ఉపాధ్యక్షురాలు సంధ్య దేవనాథన్, డైరెక్టర్ రవి గార్గ్, మెటా స్ట్రాటజిక్ ప్రోగ్రామ్స్ అండ్ పార్టనర్‌షిప్స్ దివ్య కెమనీ వధేరాలు ఐటీ, విద్యా మంత్రి నారా లోకేష్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు గురువారం ప్రారంభమైన నేపథ్యంలో సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

# విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉండదు

- కేంద్ర మంత్రి కుమారస్వామి స్పష్టీకరణ
- ప్లాంట్ పరిరక్షణపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పలుమార్లు మాట్లాడారు
- ప్లాంట్‌పై ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ
- 2030లోపు 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి లక్ష్యం



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని, ప్లాంట్‌ను పునర్నిర్మిస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతినిధులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతిని ధులతో గురువారం వేర్వేరుగా కుమారస్వామి భేటీ అయ్యారు. అనంతరం మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులతో కలిసి కుమారస్వామి మీడియాతో మాట్లాడారు.

విశాఖ ఉక్కుకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. ఈ పరిశ్రమ కోసం ఎన్నో ఉద్యమాలు జరిగాయి. విశాఖ ఉక్కు పరిశ్రమ సాధనకు జరిగిన ఉద్యమంలో సుమారు 30 మంది మరణించారు. పరిశ్రమ ప్రారంభంలో ఉత్పత్తి బాగా ఉండేది. 2013-14 వరకు ఉక్కు పరిశ్రమ పనితీరు బాగానే ఉంది. 2014లో నవరత్న హోదా కూడా సాధించింది. ఉక్కు ఉత్పత్తి పెంచాలని నిర్ణయించినప్పటి నుంచి నష్టాల్లోకి వెళ్లింది. కేంద్ర మంత్రి అయ్యాక స్టీల్‌ప్లాంట్‌పై ఎన్నో సమీక్షలు చేశా. ఉక్కు ఉత్పత్తిలో చైనా మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో భారతదేశం ఉంది. ఉక్కు ఉత్పత్తిలో మనదేశం అగ్రస్థానంలోకి రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.35వేల కోట్ల అప్పు ఉంది. 2030లోపు 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి సాధించాలని ప్రధాని మోదీ లక్ష్యం నిర్దేశించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పై ప్రధాని ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌ను విజయవంతంగా నడిపించేందుకు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాం. ప్యాకేజీని సమర్ధంగా వినియోగించేలా రోడ్ మ్యాప్‌పై కసరత్తు చేస్తున్నాం. స్టీల్ ప్లాంట్‌ను మళ్లీ నెంబర్ వన్ చేయడంలో ఖచ్చితంగా సక్సెస్ అవుతాం. కార్మికుల సమస్యలను 3 నెలల్లో కొలిక్కి తెస్తాం. కార్మికుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలిగించబోం. ఈ ఏడాదిలో పూర్తిస్థాయిలో ఉక్కు ఉత్పత్తి సాధన లక్ష్యంగా పెట్టుకున్నాం. సెయిల్‌లో విలీనం కంటే ముందు విశాఖ ప్లాంట్ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కుమారస్వామి పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లపై ప్రశంసలు

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లపై కేంద్రమంత్రి కుమార స్వామి ప్రశంసల వర్షం కురిపించారు. ఆంధ్ర డైనమిక్ సీఎం చంద్రబాబు, యంగ్ లీడర్ లోకేష్ అని అభివర్ణించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కలిసి విశాఖ ప్లాంట్ పరిరక్షణ కోసం తీవ్రంగా ప్రయత్నించారన్నారు. ఎన్నో సార్లు స్టీల్ ప్లాంట్ విషయం పై తనతో వారు చర్చించారని చెప్పారు. ప్లాంట్‌ను ఎలా పరిరక్షిం చాలనే అంశంపై పలుమార్లు తనతో మాట్లాడారని గుర్తుచేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా చూడాలని, చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పునరుజ్జీవ ప్యాకేజీ ప్రకటించాలని, మంత్రి నారా లోకేష్ చాలా సార్లు తనను కోరారని తెలిపారు. చివరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందరి విజ్ఞప్తి మేరకు ప్యాకేజీకి అంగీకరించారని కేంద్రమంత్రి కుమారస్వామి తెలిపారు.

## ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలి: కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించటంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సమర్థవంతంగా నడపడంపై అన్ని వర్గాలతో సమావేశమ య్యామని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. సమష్టి కృషితో ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అపామని చెప్పారు. ప్యాకేజీని సద్వినియోగం చేసుకొని ప్లాంట్‌ను నడుపు కోవాల ని సూచించారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ వచ్చినపుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌తో సమావేశమై చర్చించారని అన్నారు. కార్మికులకు భరోసా ఇచ్చేందుకు ప్యాకేజీ దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

# కబ్జాకోరులకు భూమి కట్టబెట్టారు



- డిప్యూటీ తహసీల్దారు నిర్వాకం
- నకిలీ డాక్యుమెంట్లతో వ్యవహారం
- ప్రజావినతుల్లో వినతిపత్రం ఫిర్యాదు
- ఆట స్థలం విడిపించాలని వినతి
- అర్జీలు స్వీకరించిన మంత్రి కొండపల్లి





మంగళగిరి(చైతన్యరథం): 50 సంవత్సరాలుగా యువతకు ఆట స్థలంగా ఉన్న భూమిని అధికారులే అక్ర మంగా నకిలీ డాక్యుమెంట్లతో కబ్జాదారులకు కట్టబెట్టారని కడప జిల్లా సిద్దవటానికి చెందిన పవన్‌కుమార్ ప్రజావినతుల కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ అక్రమానికి పాల్పడిన అధికారి ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దారుగా ఉన్నార ని.. ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకుని భూమిని కబ్జా నుంచి విడిపించాలని కోరాడు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ప్రజా వినతుల స్వీకరణ కార్యక్ర మంలో అర్జీదారుల నుంచి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీసీవోజీఎఫ్ చైర్మన్ గండి బాబ్జిలు అర్జీలు స్వీకరించారు. అనంతరం టీడీపీ ఎన్నారై వింగ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పలువురి పేదలకు ఆర్థిక సాయాన్ని నేతలు వారి చేతులమీదుగా అందజేశారు.

అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలోని 85 నిట్టూర్ చెరువుకు గండికోట నుంచి చేపట్టిన ఎత్తిపోతల పథకం పనులు 50 శాతం జరిగి ఆగిపోయాయని..మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి సాగునీరు అందించేలా చూడాలని జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు చల్లా చంద్రశేఖర్‌నాయుడు అర్జీ ఇచ్చారు.

దివ్యాంగుడినైన తనకు ఉండటానికి ఇల్లు లేదని.. దయ చేసి తనకు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం సాయం చేయాలని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నంది గం గ్రామానికి చెందిన బొల్లేపల్లి శివప్రసాద్ విజ్ఞప్తి చేశాడు.

తాను మున్సిపాలిటీకి డబ్బులు కట్టి మున్సిపల్ స్థలంలో చెరకు రసం మిషన్, టిఫిన్ బండి పెట్టుకుని అమ్ముకుంటుంటే పక్కన గంపలు అమ్ముకునే వారు తమపై దాడికి వచ్చారని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పొన్నూరు మల్లిక ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఒంటరి మహిళలనని అధికారులు స్పందించి తమపై దాడికి వచ్చిన వారి మీద చర్యలు తీసుకుని తమ వ్యాపారానికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

తమ భూమిని వెబ్ ల్యాండ్‌లో పెట్టి అధికారులు మళ్లీ రిజెక్ట్ చేశారని కర్నూలు జిల్లా కౌతాళం మండలం కంబిలనూరు గ్రామానికి చెందిన ఉప్పులపాటి వెంకటే శ్వర్లు తెలిపారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నా ఆన్‌లైన్ చేయకుండా ఇబ్బంది పెడుతు న్నారని ఫిర్యాదు చేశారు. తమ భూ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తమ స్వాధీనంలో ఉన్న భూమిని ఆన్‌లైన్ చేసి పాస్‌బుక్ ఇవ్వమంటే అధికారులు తిప్పించుకుంటున్నారని ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన చెరుకూరి భూపెందర్‌రావు ఫిర్యాదు చేశాడు. ఎన్నిసార్లు ఆఫీసు చుట్టూ తిరిగినా పనిచేయడం లేదని.. భూ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా తన పొలానికి కరెంట్ సరఫరా ఇవ్వకపోవడంతో తన ఐదెకరాల దానిమ్మ తోట నీరులేక నిలువునా ఎండిపోతుందని అనంతపురం జిల్లా నార్పల మండలానికి చెందిన కె.శ్రీనివాసులనాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు. దయ చేసి అధికారులు స్పందించి వెంటనే కరెంట్ ఇస్తే తన పంట నిలబడుతుందని.. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోయాడు.

పోలవరం ఎడమ కాలువ కోసం తమ భూమిని తీసుకుని తమకు పరిహారం ఇవ్వలేదని అల్లూరి సీతారామరాజు జిల్లా దేవిపట్నం మండలం చిన్నరమణయ్యపేటకు చెందిన పలువురు బాధితులు తెలిపారు. పరిహారం వచ్చేలా చూడాలని మడకం చంద్రరావు దొర, తదితరులు విజ్ఞప్తి చేశారు.







# జీవో 13తో గౌడ కులస్తుల అభివృద్ధి

- 335 మద్యం దుకాణాల కేటాయింపు
- లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ
- కల్లుగీత కార్మికులను బాబు కాపాడారు
- కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి



అమరావతి(చైతన్యరథం): గీత కులస్తులకు యువత నేత నారా లోకేష్ యువగ ళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీని నెరవే రుస్తూ జీవో 13 ద్వారా గీత కులస్తులకు మద్యం దుకాణాల్లో 10 శాతం వాటా కింద 335 మద్యం దుకాణాలను కేటాయించారని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన ఆయన మద్యం దుకాణాల లైసెన్స్ ఫీజులోనూ 50 శాతం రాయితీని అందిం చడం ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గీత కార్మికుల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం గీసేవానికే చెట్టు పథకాన్ని తీసుకువస్తే వైసీపీ ప్రభుత్వం దోచుకునే వారిదే పాలసీని అనుసరించిందని విమర్శించారు. ఉమ్మ డి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ పట్టణాలకు 55 కిలోమీటర్ల పరిధిలో ఉండాలని జీవో తీసుకొచ్చారు. గత ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి జీవో 693 తీసుకొచ్చి 100 కిలోమీట ర్ల దూరంలో కల్లు దుకాణాలు ఉండాలని నిబంధనలు పెట్టారని గుర్తు చేశారు. గీత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్ టీడీపీ హయాంలో ఇవ్వడం జరిగిందని తెలిపారు. వారికి రూ.105 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఎన్టీఆర్ హయాంలో గీత కార్మికుల కోసం 60 ఎకరాల భూమిని కేటాయించి నీరా తాడి పరిశ్రమను స్థాపించేందుకు కృషి చేసినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలు కల్పనలో భాగంగా రాబోయే ఐదేళ్లలో చిన్న పరిశ్రమల ద్వారా ఉద్యోగాలు సృష్టిస్తామని అన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 33 శాతం రిజర్వేషన్లు టీడీపీ ప్రభుత్వం కల్పించడం ద్వారా రాజ్యాధికారంలో భాగం కావడం సాధ్యమైందని చెప్పారు. గత వైసీపీ పాలనలో 10 శాతం రిజర్వేషన్ తగ్గించడం వల్ల 18 వేల మంది బీసీలు రాజకీయ పదవులకు దూరం అయ్యారని ఆరోపించారు. విదే శీ విద్య ద్వారా బీసీ విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకునే అవకాశం టీడీపీ ప్రభు త్వం కల్పించిందన్నారు. బీసీల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. 2024-25 బడ్జెట్‌లో బీసీల అభివృద్ధి కోసం రూ.37,970 కోట్లు కేటా యించడం జరిగిందని, రాబోయే రోజుల్లో కుట్టు మిషన్లు, పాడి గేదెలు, గొర్రెల పెంప కం, జనరిక్ మెడిసిన్ షాపులు ద్వారా బీసీలకు 50 శాతం అవకాశాలు కల్పించి వారి అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.



# టీడీపీ కేంద్ర కార్యాలయంలో గాంధీ వర్ధంతి

**నివాళులర్పించిన పార్టీ నాయకులు - జాతిపిత ఆశయాలకు అనుగుణంగా పాలన - గాంధీ మార్గంలో నడవాలని పిలుపు**

మంగళగిరి(చైతన్యరథం): అహింసే పరమధర్మంగా సత్యం, న్యాయంతో భారతా వనికి స్వాతం త్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ అని వక్తలు కొనియాడారు. మంగళ గిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేశారని, గాంధీ మార్గంలో నడవాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆయన ఆశయాలను నెరవేర్చేందు కు కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నేత లోకేష్ ఆయన మార్గంలో నడిచి రాష్ట్రంలోని యువత, పేదలకు మంచి భవిష్యత్‌ను అందించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వివ రించారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మండలి చీఫ్ విప్ పంచుమ ర్తి అనురాధ, ఏపీసీవోజీఎఫ్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్నారై వింగ్ రాజశేఖర్, కార్యాలయ కార్యదర్శి ఏవీ రమణ, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ దారపనే ని నరేంద్ర, టీడీపీ కార్యాలయ ఆహ్వాన కమిటీ సభ్యులు పర్చూరి కృష్ణ, హాజి హసన్ బాషా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌ను మించిన అవినీతిపరుడు పెద్దిరెడ్డి



- ఆయన చిట్టా మొత్తం బయటపెడతాం
- కేంద్రస్థాయి వరకు సామ్రాజ్యం విస్తరణ
- నేడు ఏమీ ఎరగనట్టు నంగనాచి కబుర్లా?
- ఓటర్ల జాబితా కన్నా పాపాల జాబితా పెద్దది
- అటవీ భూకబ్జాపై దర్యాప్తునకు కమిటీ వేశాం
- నిగ్గు తేల్చి కూటమి చర్యలు తీసుకుంటుంది
- శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ

మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్రంలోనే అత్యంత అవినీతిపరుడు జగన్ అయితే.. ఆయనను మించిన వాడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని శాసనమండలి చీఫ్ విప్ పంచు మర్తి అనురాధ పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్‌పై 31 క్రిమినల్ కేసులు ఉన్నాయి. లక్షల కోట్లు దోచేశాడు..420 సీఎంగా గూగుల్‌లో దర్శనమిచ్చే వ్యక్తి జగన్ అని విమర్శించారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అవినీతి ఒక్కొక్కటిగా బయటికొస్తుందని తెలిపారు. పగలేమో పూజలు, రాత్రంతా దోపిడీలు చేస్తుంటాడు. ఇలాంటి స్ప్లిట్ పర్సనాలిటీ గలవారు ఎక్కడా ఉండరు.. అతని అవినీతి సామ్రాజ్యాన్ని పీలేరు మొదలుకుని నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రం నుంచి కేంద్ర స్థాయి వరకు అన్ని దిక్కులా విస్తరించారనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. నేనే పాపం ఎరుగను, నాకేమీ తెలియదు అని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన ప్రెస్‌మీట్‌లో తాను అమాయకుడినని మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు.

### అవినీతి చేయలేదని చెప్పగలరా?

శాండ్ మాఫియా చేయలేదని పెద్దిరెడ్డి గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పగలరా? ల్యాండ్ మాఫియా చేయలేదని గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పగలరా? చివరికి రైతులు రక్తం కూడా పీల్చుకున్నారు. శివశక్తి డెయిరీ ద్వారా రైతుల నుంచి తక్కువ ధరకు పాలు కొని ఎక్కువ రేట్లకు అమ్మిన మాట వాస్తవం కాదా? మదనపల్లిలో ఒక గవర్న మెంట్ ఆఫీస్‌లో ఫైల్ దహనం అయితే ఏ సంబంధం లేదని చెప్పి ముందస్తు బెయిలు ఎందుకు తెచ్చుకున్నారు? అసైన్డ్ భూములు కొట్టేసిన మాట వాస్తవం కాదా? ఇరిగేషన్ భూములు కొట్టేసిన మాట వాస్తవం కాదా? శాండ్ మాఫియాలో కోట్లు సంపా దించి అవినీతి సొమ్మును కూడగొట్టుకుంది వాస్తవం కాదా? ల్యాండ్ మాఫియా ఎక్కడ పడితే అక్కడ ఎకరాలు ఎకరాలు కొట్టేసి కోట్లు దండుకున్న మాట వాస్తవం కాదా? ఒక ఎకరం మొదలుకొని వెయ్యి ఎకరాల వరకు భూములు కొట్టేసిన బాపతి మీరు. నేనేమీ ఎరగను, నాకు ఏ సంబంధం లేదని చెప్పి ఒక స్టేట్మెంట్ ఇస్తే సరిపోతుందా? మీ పుంగనూరు ఓటర్ లిస్టు కన్నా మీ అవినీతి పాపాల లిస్టే పెద్దదిగా ఉంది. చిత్తూరు జిల్లా పులిచర్ల మండలంలో అసైన్డ్ భూములు కాజేసిన మాట వాస్తవం కాదా? 982 ఎకరాల భూమి కబ్జా చేశారని మీడియాలో సైతం వచ్చింది. మీరు దానికి వివరణ ఇచ్చే పరిస్థితి లో లేరు. పుంగునూరు మండలం రాగాని పల్లెలో భూములు కొట్టేసిన మాట వాస్తవం కాదా? రేణిగుంట ఎయిర్ పోర్టులో 100 ఎకరాల గవర్నమెంట్ ల్యాండ్‌లో మధ్యలో 20 ఎకరాలు మీ భార్య పేరు మీద ఎలా వచ్చింది? ప్రభుత్వ భూములు కూడా మీరు కొట్టేసి న పరిస్థితి. గవర్నమెంట్ పర్మిషన్లు లేకపోయినా ఎత్తిపోతల పథకాలు అని చెప్పి తమ స్వార్థం కోసం పనులు మొదలుపెట్టారు. ప్రాజెక్టులు మొదలుపెట్టి ఆవులపల్లిలో నేతిగుట్ల పల్లెల్లోని ప్రజలను అనధికారికంగా రాత్రికి రాత్రి ఖాళీ చేయించేసి వారి ఉసురు పోసుకున్నారు. మీరు ఇలా చేసినందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మీకు వంద కోట్లు ఫైన్ వేసిన మాట వాస్తవం కాదా? తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టులో ఎంత అవినీతి చేశారో అందరికీ తెలుసు. అక్కడ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కై ఏం చేశారో కూడా ప్రజలందరికీ తెలుసు. ఇంత అవినీతి చేసిర పెద్దిరెడ్డిని ఏం చేసినా పాపం లేదనే మాటే వస్తది తప్ప ఇంకో మాట రాదు.

### అటవీ భూమని కబ్జా చేసి గెస్ట్‌హౌస్ కట్టలేదా?

75 ఎకరాలు ఫారెస్ట్ ల్యాండ్‌ను మీరు కబ్జా చేయడమే కాకుండా మీ పేరు మీద రాయించుకోవడమే కాకుండా ఏకంగా రోడ్డు వేసి అక్కడ ఒక గెస్ట్ హౌస్ కట్టారు. ఆ గెస్ట్ హౌస్ ఏ అవినీతి కార్యకలాపాలకు ఉపయోగపడుతుందో మీరు ఖచ్చితంగా చెప్పి తీరాల్సిందే. ప్రస్తుత ప్రభుత్వం దాని మీద కమిటీ వేసింది. అవన్నీ కూడా త్వరలో బయటికి వస్తాయి. కచ్చితంగా నిగ్గు తేలుస్తాం. అక్కడ రోడ్లు ఎవరు ఎవరి సొమ్ముతో వేశారు? పన్నుల రూపేణ ప్రజలు కట్టిన సొమ్ముతోనే రోడ్లు వేశారు కానీ సామాన్య ప్రజలకు ఎక్కడైనా ఒక తట్టెడు మట్టితో ఒక మట్టి రోడ్డు వేశావా? మీరు ఇంత పాపాలు ఇంత అవినీతి చేసి ఏమీ ఎరగని అన్నట్టుగా మీరు మాట్లాడటం నిజంగా చాలా హాస్యాస్పదంగా ఉంది. పైగా వాళ్ల మీద డిఫమేషన్ కేసులు వేయటం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు.

### భూ కబ్జాను ప్రశ్నిస్తే తాళిబొట్టు తెంపుతారా?

మదనపల్లిలో ఐదున్నర ఎకరాలు ఉన్న ఒక ఆవిడ భూమిని నీ తరపు వాళ్లు ఎలా కబ్జా చేస్తారు? నా పొలం నాకు ఇవ్వండి అని అడిగితే ఆవిడ తాళిబొట్టు కూడా తెంచేశారు. ఇంతటి అరాచకమా? ఇంత అవినీతి చేసి అడ్డమైన ప్రగల్భాలు పలకడం అన్యాయం. అప్పుడు కుప్పం మున్సిపాలిటీ నాదే..కుప్పంలో నేనే గెలుస్తా..కుప్పంలో చంద్రబాబు ఎలా గెలుస్తారో చూస్తా అన్నావు? ఇప్పుడు ఏమైంది? మీరు ఎంతమంది గెలిచారు? అక్కడ ముగ్గురు అంటే ఇంకొక అతను మొన్న ఎన్నికల్లో ఇంకో అతను థర్డ్ పార్టీ వచ్చి నిలబడకపోతే మీకు ఆ 6000 ఓట్లు కూడా వచ్చేవి కావు. ఏదో కన్ను లు లొట్టబోయి బయటపడ్డావు. కచ్చితంగా మీ మీద ప్రభుత్వం యాక్షన్ తీసుకోవ డానికి ముందుకు వస్తుంది. మీ అవినీతి చిట్టా అంతా బయటపెడతాం. మిమ్మల్ని మీ పక్కనున్న తంబళ్లపల్లి ఎమ్మెల్యే, అంతకు ముందున్న మీ తమ్ముళ్లు, మీ కొడుకులు, ఆ ఫ్యామిలీ ప్యాకేజ్‌లాగా మీరందరూ ఈ రాజకీయాల్లోకి వచ్చి ప్రజల సొమ్ము తినేసి దేనికి చలనం లేకుండా తయారయ్యారు. ఖచ్చితంగా పెద్దిరెడ్డి సంగతి కూటమి ప్రభుత్వం తేలుస్తుందని స్పష్టం చేశారు.

## తెలంగాణ బకాయిలు రూ.50 కోట్లు ఇప్పించండి

- ఆ రాష్ట్రంలో ఉన్న రికార్డులను తెప్పించండి
- వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, మసీదుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయండి
- బారాషహీద్ దర్గా అభివృద్ధికి నిధులు విడుదల చేయండి
- సీఎం చంద్రబాబుకు ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ వినతి



అమరావతి (చైతన్యరథం): తెలంగాణ వక్ఫ్ బోర్డ్ నుంచి రావాల్సిన 50 కోట్ల రూపాయల పెండింగ్ బకాయి లను ఇప్పించాలని రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడును ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును గురువారం అబ్దుల్ అజీజ్ కలిసి పలు సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్ర రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్‌కు చెందిన అన్ని రికార్డులు (డిజిటల్ రికార్డులతో సహా), పత్రాలు తెలంగాణ నుంచి బదిలీ చేయలేదని, ఆస్తులను అప్పగించలేదని తెలిపారు. చాలా వ్యాజ్యాలు / కోర్టు కేసులకు ఆ ఫైళ్లలో సమాచారం అవసరమని పేర్కొన్నారు. ఏపీ వక్ఫ్‌బోర్డు వద్ద రికార్డులు లేని కారణంగా చట్టపరమైన విషయాలలో కౌంటర్లు దాఖలు చేయలేకపోతున్నామని వివరించారు. త్వరితగతిన ఏపీ వక్ఫ్ బోర్డుకు చెందిన రికార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2024-25 సంవత్సరానికి గాను మసీదుల ప్రహరీ గోడలు, శ్మశానాలు, ఈద్గాలు, అషూర్ ఖానాలు, దర్గాలు, తదితర నిర్మాణాలు, మరమ్మతుల కోసం రూ.10 కోట్లు, వక్ఫ్ ఆస్తులను ఆక్రమణల నుండి రక్షించేందుకు చర్యలు తీసుకోవడానికి, ఆస్తులకు ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డ్‌ల ఏర్పాటు, తదితర చర్యలకు రూ. 50 కోట్లు, హై కోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్, అపెక్స్ కోర్ట్‌ల్లో కేసులను వాదించడానికి చట్టపరమైన ఖర్చుల ఖర్చు కోసం రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఏపీ ఆన్‌లైన్ సంస్థకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లించాలని కోరారు. 2014లో నెల్లూరు లోని బారా షహీద్ దర్గా ప్రాంగణంలో రొట్టెల పండుగ-ఇస్లామిక్ కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధి, ఇతర అనుబంధ అభివృద్ధి కోసం రూ.20 కోట్లు విడుదల చేశారని, దానిని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని తెలిపారు. బారా షహీద్ దర్గా అభివృద్ధికి సంబంధించి గత ఏడాది ప్రకటించిన రూ.5 కోట్లు విడుదల చేయాలని అబ్దుల్ అజీజ్ కోరారు.






## ఎన్నారై వింగ్ ఆధ్వర్యంలో ఆపన్నులకు సాయం

*వివిధ సమస్యలతో ఆర్థిక సాయం కోసం గతంలో అర్జీలు పెట్టుకున్న వారికి టీడీపీ ఎన్నారై వింగ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నారైలు అందించిన సాయాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా దాదాపు 11 మంది పేదలకు గురువారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగదును స్వీకరించిన వారు టీడీపీ చేసిన మేలును మరిచిపోలేమని నేతలకు కృతజ్ఞతలు తెలియచేశారు.*

# ప్రజల సొమ్ము దోచుకున్న గజదొంగ పెద్దిరెడ్డి

- త్వరలోనే అక్రమాలన్నీ బయటకి
- మళ్లీ అధికారంపై పెద్దిరెడ్డి పగటి కలలు
- సూపర్ సిక్స్ పథకాలు తప్పక అమలు చేస్తాం
- మంత్రి మండిపల్లి స్పష్టీకరణ



రాయచోటి (చైతన్యరథం): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అన్యాయాలు, అక్రమాలు త్వరలో బయటకు తీసి ఆయనపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో మంత్రి పెద్దిరెడ్డి అక్రమాలపై పాత్రికేయుల సమావేశం నిర్వహించి మంత్రి మండిపల్లి మట్లాడారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 7 నెలల కాలంలో ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారన్నారు. ప్రజలు మాపై చూపిన నమ్మకాన్ని తప్పక నెరవేరుస్తామని గతంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తామని మంత్రి ఉద్ఘాటించారు.

## సొంత నియోజకవర్గ ప్రజలనే దోచుకున్నారు

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత ఐదు సంవత్సరాల్లో సొంత పుంగనూరు నియోజకవర్గ ప్రజలనే మోసం చేసి వారి భూములను దోచుకున్నారని మంత్రి విమర్శించారు. ఆ నియోజకవర్గ ప్రజలు నాలుగైదు సార్లు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డిని, ఆయన కుమారుడిని ఎంపీగా గెలిపించారని.. అయినా వారికి ఎంతో అన్యాయం చేశారన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో గతంలో పాడి రైతులు లీటరు పాలు 25 రూపాయలకు అమ్ముకునేవారని, అలాంటి వారిని బెదిరించి పెద్దిరెడ్డి సొంత డెయిరీకి కేవలం లీటర్ 18 రూపాయలకే పాలు కొనుగోలు చేసి వారి కడుపు కొట్టారని మంత్రి దుయ్యబట్టారు. రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరు, మదనపల్లె ప్రాంతాల్లోని మామిడి రైతులను దోచుకుని కిలో 13 రూపాయలకు అమ్మే మామిడికాయలను కేవలం 8 రూపాయలకే కొనుగోలు చేసి వారికి అన్యాయం చేశారని మంత్రి విమర్శించారు. పెద్దిరెడ్డి గతంలో ఏ శాఖలో పనిచేసినా ఆ శాఖకు సంబంధించిన ఆస్తులను, భూములను దోచుకున్న గజదొంగ అని ధ్వజమెత్తారు. గతంలో ఇసుకను ఇతర రాష్ట్రాలకు పంపించి వేల కోట్ల రూపాయలు పెద్దిరెడ్డి దోచుకున్నారని విమర్శించారు. వేలకోట్ల విలువ చేసే ఎకరాల కొద్దీ భూములు కబ్జా చేసి, ఆ దారుణాలు బయటకు వస్తాయనే భయంతో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లను దగ్నం చేయించింది పెద్దిరెడ్డేనని మంత్రి ఆరోపించారు. మేము ఏమైనా అక్రమాలు, అన్యాయాలు చేసి ఉంటే రుజువు చేయించు. నువ్వు చేసిన అక్రమాలు, అన్యాయాలు బయట పెట్టేందుకు మేము సిద్ధంగా ఉన్నాము. అందుకు పెద్దిరెడ్డి సిద్ధమేనా అని మంత్రి మండిపల్లి సవాల్ విసిరారు.

## కక్ష సాధింపులు ఉండవు

ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల కాలంలో మేము ఎవరిపైనా కక్ష సాధింపులకు పాల్పడటం లేదు. ఇక మీదట కూడా అలాంటి పనులు చేయబోం. అయితే తప్పు చేసిన వారిని మాత్రం వదిలేది లేదు. పెద్దిరెడ్డి భార్య, కుమారుని పేరుమీద ఉన్న అక్రమాస్తులను వెలికితీసి తీసి చర్యలు తీసుకునే సమయం తొందరలోనే వస్తుంది. ముదివేడు ప్రాజెక్టు పరిధిలోని రైతుల భూములను లాక్కుని వారికి పెద్దిరెడ్డి అన్యాయం చేశారు. గాలేరు -నగరి కాలువ పనులకు సంబంధించి వేలకోట రూపాయలు దోచుకున్నారని మంత్రి మండిపల్లి విమర్శించారు.

## పెద్దిరెడ్డికి ఆ అర్హత లేదు

నాలుగు సార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన చంద్రబాబు విజన్ గల నాయకుడు. ఆయనను ప్రశ్నించే అర్హత, హక్కు పెద్దిరెడ్డికి ఏ మాత్రం లేదు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన దానికన్నా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లో చేసిన అభివృద్ధి ఎన్నో రెట్లు అధికం. పోలవరం, రాజధాని అమరావతి పనులు పరుగులు తీస్తున్నాయి. సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు, ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ఇటీవలే 11, 400 కోట్లు మంజూరు చేసింది. ఈ అభివృద్ధి పనులు మీ కళ్లకు కనపడవా అని మంత్రి మండిపల్లి ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలన్నీ తప్పకుండా అమలు చేస్తాం. ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మందికి పింఛన్ రూ.1000 చొప్పున పెంచి రూ.4 వేలు పెన్షన్ పంపిణీ చేస్తున్నాం. అదేవిధంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నాం. త్వరలో డీఎస్సీ పరీక్ష నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తాం. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారు. పెద్దిరెడ్డి పగటి కలలు కనటం మానుకోవాలి. చంద్రబాబు నాయకత్వంలో మళ్లీ తిరిగి మేమే అధికారంలోకి వస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఉద్ఘాటించారు.

ఈ సమావేశంలో మంత్రితో పాటు పుంగనూరు టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా బాబు, తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి జయచంద్ర రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జగన్ రాజు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు కూడా మాట్లాడారు. వీరితో పాటు తంబళ్లపల్లె పరిశీలకులు సీడ్ మల్లికార్జున, పార్లమెంట్ జనరల్ సెక్రటరీ దొరస్వామి నాయుడు, మోడెం శివ కుమార్, శ్రీకాంత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# యడవల్లిలో లెదర్ ఉత్పత్తుల కేంద్రం

- రేపు తయారీ పరిశ్రమకు శంకుస్థాపన
- చర్మకారులకు జీవనోపాధికి ప్రభుత్వం చర్యలు
- లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి పిల్లి మాణిక్యరావు



మంగళగిరి(చైతన్యరథం): ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం యడవల్లిలో 25 ఎకరాల లిడ్‌క్యాప్ స్థలంలో లెదర్ ఉత్పత్తుల తయారీ కేంద్రానికి ఫిబ్రవరి 1న శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు తెలిపారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. లెదర్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రూ.6 కోట్లు కేటాయించి ఆ ప్రాంత చర్మకారులకు జీవనోపాధి మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. రాష్ట్రంలో చర్మ పారిశ్రామికాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.

అనేకరం గాల పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చినట్లే.. చర్మ పారిశ్రామికాభివృద్ధికి కూడా త్వరలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి రానున్నారని వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడి న చర్మశుద్ధి కేంద్రాలు, లెదర్ గూడ్స్ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. 20 ఏళ్ల క్రితం చంద్రబాబు లిడ్‌క్యాప్ కోసం మినీ, మీడి యం, మెగాపార్కుల నిర్మాణం కోసం స్థలాలను కేటాయిస్తే.. జగన్ వాటిని తన స్వార్థాని కి వాడుకున్నాడు. జగన్ అన్యాక్రాంతం చేసిన లిడ్‌క్యాప్ భూములు ఆ సంస్థకే చెందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చర్మకారుల జీవితాలు బాగుపడాలని చంద్రబాబు ధ్యేయంగా పెట్టుకుని వారి కోసం అనేక పథకాలు తీసుకొచ్చి వారి గౌరవాన్ని పెంచారు. చర్మకారులను పారిశ్రామికంగా ఎదిగేలా చేశారు.

రాష్ట్రం విడిపోయాక కూడా ఈ లిడ్‌క్యాప్‌కు నిధులు కేటాయించి ఎంతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. రోడ్ల పక్కన చెప్పులు కుట్టే వారికి అనేక సదుపాయాలు కల్పించడంతో పాటు వారికి రుణాలు అందించేలా చర్యలు చేపట్టడంతో వారు ఎంతో అభివృద్ధిలోకి వచ్చారని కొనియాడారు. లెదర్ ఇండస్ట్రీస్‌ని తెచ్చి రాష్ట్రానికి రెవె న్యూ వచ్చేలా చేసేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో లిడ్‌క్యాప్‌కు సంబంధించిన చర్మ పరిశ్రమ ఒక్కటి మాత్రమే ఉంది. అది కూడా ప్రైవేటు వ్యక్తుల చేతు ల్లో తడలో వరదాయపాలెం అనే ఊరిలో దాదాపు వంద ఎకరాల స్థలంలో అవంతి ట్రేడర్స్ అని ఉంది. ఇందులో ఒక శాతం మాత్రమే లిడ్‌క్యాప్‌కు వాటా ఉంది. ఇలాంటి పరిశ్రమలు రాష్ట్రంలో ప్రభుత్వం తరపున నెలకొల్పాల్సిన అవసరముందని తెలిపారు. చర్మాలు, గొర్రెలు, మేకల చర్మాల ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్న మనం ఈ చర్మాలను చెన్నైకు తీసుకెళ్లి అక్కడ ప్రాసెసింగ్ చేసి ఎక్స్‌పోర్టు చేస్తున్నారు. ఆ ప్రాసెసింగ్ యూనిట్ల ను మన రాష్ట్రంలోనే పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

పక్క రాష్ట్రానికి తీసుకెళ్లడం వల్ల చర్మాలను అమ్ముకుని జీవనం సాగించుకునే వారికి అన్యాయం జరుగుతుందని..వారికి జీవనోపాధి కల్పిస్తామని చెప్పారు. అంతేకాకుండా రాష్ట్రానికి రెవెన్యూ కూడా సమకూరి ఉద్యోగావకాశాలు కలుగుతాయని తెలిపారు. లెదర్ ఇండస్ట్రీస్ ద్వారా యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని, రాష్ట్రంలో లెదర్ పరిశ్రమను నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు.

# వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్యం

- భవిష్యత్ బిజినెస్ లీడర్ల అభివృద్ధికి చర్యలు - 24 సెక్టార్లలో ఐఎస్‌బీతో ఒప్పందం
- యువతకు ఉపాధి కల్పన దిశగా అడుగులు
- ప్రజా సౌకర్యం కోసం 'మనమిత్ర' యాప్ - సీడాప్ చైర్మన్ గుణపాటి దీపక్‌రెడ్డి



విజయవాడ(చైతన్యరథం): రాష్ట్రం నుంచి భవిష్యత్ బిజినెస్ లీడర్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీడాప్ పనిచేస్తుంద ని.. అందుకు ఐఎస్‌బీతో ఒప్పందం కూడా చేసు కున్నామని ఏపీ ఉపాధి కల్పన, వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ(సీడాప్) చైర్మన్ దీపక్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో సీడాప్ కార్యాలయంలో గురువారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో కొన్ని కోర్సులకు ఎంవోయూ చేసుకోవడంలో ముఖ్యమైన ఉద్దేశం వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదమని చెప్పారు. అదేవిధంగా సెంచూరియన్ యూనివర్శిటీతో ఒప్పందం చేసుకున్నామని, దీనివల్ల 40 శాతం ట్రైనింగ్ పూర్తిచేసిన వారికి స్వయం ఉపాధిలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో రానున్న మూడు సంవత్సరాల్లో 22 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. సీడాప్ ఒక నోడల్ ఏజెన్సీగా ఉండేలా ముఖ్యమంత్రి డైరెక్షన్స్‌లో పనిచేస్తుందన్నారు. యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో యువతకు అవకాశాలు కల్పిస్తామన్నారు. మంత్రి లోకేష్ మార్గనిర్దేశంలో మేం డైనమిక్‌గా పనిచేస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఆరు ఇండస్ట్రియల్ పాలసీలు ఆరు నెలల్లోనే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల సౌకర్యం కోసం మనమిత్ర అనే యాప్ ద్వారా 166 సర్వీసులు అందు బాటులో ఉండేలా వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చామని, దీన్ని 520 సర్వీసులకు తీసుకెళతా మని వివరించారు. స్వర్ణాంధ్ర 2047 విడుదల చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 347 లక్షల కోట్లకు పెంచేందుకు, తలసరి ఆదాయాన్ని 58 లక్షలకు పెంచేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు పనిచేస్తున్నారని తెలిపారు. ఏపీని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిది ద్దేలా పనిచేయాలని ముఖ్యమంత్రి చెప్పారని, 20 లక్షల ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా సీడాప్ కూడా అందులో భాగస్వామి అయిందని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లూ రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందన్నారు. ఏపీ ఫిజికల్ హెల్త్ ఇండెక్స్ 17వ స్థానానికి దిగజా రిందని చెప్పిన ఆయన చివరన పంజాబ్ రాష్ట్రం మాత్రమే ఉండగా..ఆ రాష్ట్రంపైన మన రాష్ట్రం ఉండటం దురదృష్టకరమన్నారు. ఐఎస్‌బీ ప్రతినిధి చందన్ చౌదరి మాట్లాడుతూ మానుఫ్యాక్చరింగ్ రంగంలో లీడర్స్‌ను తయారు చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరి గిందన్నారు. ఉద్యోగ సృష్టి, ఎగుమతులను పెంచడానికి మనం తయారీ రంగం వృద్ధిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రభు త్వం తయారీ రంగంలో వేగవంతమైన వృద్ధిని ప్రదర్శించడం, ఉద్యోగాలను సృష్టించడం ద్వారా దేశంలో ఏపీ సరికొత్త విధానంతో ముందుకెళుతుందని వివరించారు. ఈ సమా వేశంలో సెంచూరియన్ యూనివర్శిటీ ప్రతినిధి జె.ఎం.రావు, ఐఎస్‌బీ ప్రతినిధి యుగల్ నౌహ్రియా, సీడాప్ సీఈవో పి.నారాయణ స్వామి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

# విశాఖలో కేంద్రమంత్రుల పర్యటన... స్టీల్ ప్లాంట్ పరిశీలన

## • స్టీల్ ప్లాంట్‌ను నెంబవర్ వన్ స్థానంలో నిలబెడతామన్న కేంద్రమంత్రి కుమరస్వామి





విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన తర్వాత తొలిసారిగా కేంద్ర ఉక్కు శాఖామంత్రి కుమారస్వామి, కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ విశాఖకు వచ్చారు. ఈ సందర్భంగా విశాఖ ఎయిర్‌పోర్టులో వీరికి కూటమి నేతలు ఘనస్వాగతం పలికారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, కూటమి నేతలు, కార్యకర్తలు అందరూ కూడా విమానాశ్రయానికి చేరుకున్న కేంద్రమంత్రులకు ఘనంగా స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టులో కేంద్ర మంత్రులకు కూటమి మహిళ నేతలు, కార్యకర్తలు పూలవర్షం కురిపించారు. అనంతరం అక్కడి నుంచి స్టీల్ ప్లాంట్‌కు బయలుదేరారు. మార్గ మధ్యలో కూడా కేంద్రమంత్రులకు కూటమి పార్టీ నేతలు గజమాలలు వేసి స్వాగతం తెలిపారు. షీలానగర్ వద్ద కేంద్ర మంత్రులు కుమార స్వామి, శ్రీనివాస వర్మలకు గజమాలతో సగౌరవంగా స్వాగతించారు. అనంతరం స్టీల్ ప్లాంట్‌ను పరిశీలించిన ఆయన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను మళ్లీ నెంబర్ వన్ చేయడంలో ఖచ్చితంగా సక్సెస్ సాధిస్తామని, రెండు, మూడు నెలల్లో కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపుతామని చెప్పారు. ఈ వార్షిక ఏడాదికి పూర్తిస్థాయిలో ఉక్కు ఉత్పత్తి సాధన లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అన్నారు.

# నేటి నుంచి అరకులో చలి ఉత్సవాలు... కోటి రూపాయాల నిధులు విడుదల



అరకు (చైతన్యరథం): అరకు చలి ఉత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మూడు రోజుల పాటు నిర్వహించే చలి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమై ఆదివారంతో ముగియనున్నాయి. అయితే ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ రైడ్?ను ఏర్పాటు చేశారు. హెలికాప్టర్ రైడ్ కోసం పర్యటకులకు 4 వేల రూపాయలను ప్రవేశ రుసుముగా నిర్ణయించారు. 3 రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన ఆచార వ్యవహారాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఒడిశా, ఛత్తీస్ గడ్, మణిపూర్ తదితర రాష్ట్రాల్లో పరిధిలోని కళాకారులతో వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారి యంతాంగం అన్ని చర్యలు చేపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అరకు చలి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఉద్దేశంతో కోటి రూపాయలు నిధులు విడుదల చేసింది.

# ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ



శ్రీకాకుళం (చైతన్యరథం): ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్-7 ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసు యంత్రాంగంతో పాటు ప్రజల చైతన్యవంతమైన భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.వనజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ పీవో టి.భవానీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

### ద్విచక్ర వాహనంలో మంటలు

పట్టణ శివారు లెప్రసీ కాలనీ వద్ద ఉన్న ఓ పెట్రోల్ బంకు వద్ద ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగాయి. వివరాల్లోకి వెళితే సరుబుజ్జిలి మండలం కొండవలస గ్రామానికి చెందిన అల్లాడ రాజు ఆ బంకులో పెట్రోల్ కొట్టించాడు. అనంతరం ద్విక్ర వాహనం స్టార్ట్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పెట్రోల్ బంకు సిబ్బంది.. అక్కడ ఉన్న మరికొంతమంది ద్విచక్ర వాహనదారులు భయాందోళనతో పరుగులు తీశారు. ఈ క్రమంలో అప్రమత్తమై సిబ్బంది ఆ వాహనాన్ని బంకు బయటకు తీసుకొచ్చి మంటలను అదుపు చేశారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

# విద్యార్థులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కురుపాం (చైతన్యరథం): విద్యార్థులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకొని సాగులో నూతన పద్ధతులు అవలంబించాలని కేవీకే సమన్వయకర్త ఎస్. ధ్రువ సూచించారు. గురువారం రస్తాకుంటుబాయి కేవీకేలో శ్రీకాకుళం జిల్లాలోని వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వర్మీ కంపోస్టు, పుట్ట గొడుగుల తయారీ, ఫౌల్ట్రీ, చిరుధాన్యాల డెమో యూనిట్లు కేవీకే ద్వారా అందిస్తున్న సేవలను చూపించారు. అనంతరం వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు అనంతవిహారి, శ్రీనివాసరాజు, స్రవంతి, అనూజి పాల్గొన్నారు.

# బాలికల లింగ నిష్పత్తిని పెంచాలి



శ్రీకాకుళం (చైతన్యరథం): బాలికల లింగ నిష్పత్తిని పెంచాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. బాలికలను 'రక్షించండి- బాలికలను చదివించండి' కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అమలు చేస్తున్నాయన్నారు. అనంతరం ఆడబిడ్డలకు జన్మనిచ్చిన తల్లులకు చైల్డ్ ఇన్సెంటీవ్ కిట్లను 50 మందికి అందజేసి, అక్కడే ఏర్పాటు చేసిన పిల్లల ఊయలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే దత్తత పోస్టర్‌ను ఆవిష్కరించి క్రీడల్లో గెలుపొందిన 10 మందికి రూ.2500 నగదు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, డీఎంహెచ్‌వో బాల మురళీకృష్ణ, డీఈవో తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో ఉద్యోగం ప్రకటనను నమ్మి మోసపోవద్దు

## • ప్రజలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే బి.అశోక్ కుమార్



శ్రీకాకుళం (చైతన్యరథం): ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగమనే ప్రకటన చూసి వెళ్లారా? అంతే జీవితాన్ని నాశనం చేసుకున్నట్టే. అక్కడికి వెళ్లి బైటకు రావాలంటే బతుకుమీద ఆశలు దాదాపు వదులు కోవాల్సిందే. ఇలాంటి ఘటన ఇచ్చాపురంలోని బెల్లుపడకు చెందిన ఒక యువకునికి ఎదురైంది. ఇదే విషయాన్ని రామయ్యపుట్టుగలోని ప్రభుత్వ విప్ బి.అశోక్ సమక్షంలో విలేకరులకు తన బాధను వెల్లడించాడు. బెల్లుపడకు చెందిన బచ్చు మణికంఠ గత ఏడాది మేనెలలో ఆన్‌లైన్ ద్వారా డేటాఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి ధరఖాస్తు చేసుకోవాలనే ప్రకటన చూశాడు థాయ్‌లాండ్‌లోని ఈ ఉద్యోగానికి ధరఖాస్తు చేసుకున్నాడు. పాసుపోర్టు రెడీ చేసుకుని థాయ్‌లాండ్‌కు వెళ్లి అక్క దిగాడు. వెంటనే సదరు కంపెనీ డ్రైవరునంటూ ఓ వ్యక్తి వచ్చి కారులో తీసుకువెళ్లాడు. అక్కడనుంచి మణికంఠను మరోవ్యక్తికి అప్పగించటంతో వారు బర్మా బోర్డ్రు దాటించి మయన్మార్ వరకు తీసుకువెళ్లాడు. అక్కడ మయన్మార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగానున్న రెబల్ ఆర్మీ అంటూ వారి చేతికి మణికంఠను అప్పగించాడు. అక్కడున్న కొందరు రెబల్ ఆర్మీ ఆధ్వర్యంలో కంపెనీ ఉందని నమ్మించి అక్కడకు వెళ్లాక తన వస్తువులన్నీ తీసుకుని ఓభవనంలోకి తీసుకువెళ్లారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగమని చెప్పి ఇతరదేశాల యువకులను ఇక్కడకు రప్పించి ఫ్రాడ్‌కాల్స్, క్రిప్టోకరెన్సీ పేరిట సైబర్‌నేరాలు చేయించుకుంటున్నారు. మణికంఠకు ప్రతీరోజూ టార్గెట్‌లు ఇచ్చి ఇరాక్, శ్రీలంక, ఇండియా, పాకిస్థాన్, బంగ్లాదే ష్, దుబాయ్ వంటి దే శాల యువకులకు మెసేజ్‌లు చేసి వారి వాట్సప్‌నెంబర్లు తెలుసుకుని వారితో చాటింగ్ చేయాలని బెదిరించే వారు. వారి మోసం చేసి సొమ్ములు రాబట్టుకోవడం వీరి పని. ఒక్కోసారి మాట వినని వారిని చిత్రహింసలకు గురిచేసేవారు. కునుకుతీసినా వాటర్‌ప్రెజర్‌తో హింసించటం లేకుంటే విద్యుత్ షాక్‌లు ఇవ్వటం, నిల్చోబెట్టి చేతులు పైకిఎత్తి ఉంచి లాక్‌లు వేయటం చేసేవారు. కనీసం తన తల్లిదండ్రులతో మాట్లాడాలన్నా అవకాశం ఇవ్వలేదని మణికంఠ వాపోయాడు. ఈ తరుణంలో మిత్రుడి సాయంతో తన తల్లిదండ్రులు ఎమ్మెల్యే అశోక్, కేంద్రమంత్రి రామ్మోహననాయుడును సంప్రదించారని, వారి సహకారంతో ఇటీవల గ్రామానికి చేరుకున్నానని మణికంఠ తెలిపాడు. తనలా ఎవరూ మోసపోకూడదని చెబుతున్నాడు.

# విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యత అవసరం

విశాఖపట్నం (చైతన్యరథం): గీతం డీమ్డ్ వర్సిటీ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో గురువారం నుంచి నిర్వహించిన గీతం మీట్ (జెమ్)-2025 జాతీయస్థాయి యువజనోత్సవాన్ని బెంగళూరుకు చెందిన లేకమేన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన ప్రముఖ పర్యావరణవేత్త ఎం ఆనంద్ ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. డీన్ ఆచార్య రాజాపణి పప్పు, కన్వీనర్ దాన్ కృష్ణకుమారి మాట్లాడుతూ వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా సాంస్కృతిక వైపున్యాలను వెలికితీసే లక్ష్యంగా గత 33 ఏళ్లుగా 'జెమ్'ను నిర్వహిస్తున్నామన్నారు. జెమ్ సీఈవో ఎస్. మిశ్ర కెచెబైహేష్ తనుతన నిర్వాహక కమిటీ బృంద సభ్యులు పాల్గొన్నారు.

# సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అమలాపురం (చైతన్యరథం): విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రతీ ఇంటినీ సూర్యఘర్ వెలుగులతో నింపుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పీఎం సూర్యఘర్ పథకం అమలు తీరు పురోగతిపై నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సోలార్ ప్యానల్ కనెక్షన్ల కోసం తక్షణమే పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో బల్క్ వినియోగదారులను గుర్తించి పథకాన్ని పరిపూర్ణంగా వర్తింప చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో లబ్ధిదారులను కూడా గుర్తించి పథకం అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. వినియోగదారులు విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారాలన్నారు. సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుని ఉచితంగా విద్యుత్‌ను గృహ అవసరాలకు వినియోగించుకుంటే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. లబ్ధిదారులు రూ.2 లక్షల విలువైన 3 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లను ఇంటి కప్పుపై ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందవచ్చునన్నారు. లబ్ధిదారులు 10 శాతం వాటా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నారు. తద్వారా 20 ఏళ్ల పాటు ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందవచ్చునని వివరించారు. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సౌర విద్యుత్‌ను వినియోగించుకోవడం ద్వారా కాలుష్య రహిత, పర్యావరణ హిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ మాట్లాడుతూ జీఎస్టీ, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వర్తకులతో త్వరలో సమావేశం నిర్వహించి పథకం అమలు తీరుపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్షిస్తామన్నారు. సమావేశంలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ స్వామినాయుడు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శంకరవరప్రసాద్, ఎల్డీఎం కేశవవర్మ, చీఫ్ సేల్స్ మేనేజర్ నందెపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 1న సీఎం చంద్రబాబు కొవ్వూరు పర్యటన రద్దు

కొవ్వూరు (చైతన్యరథం): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఫిబ్రవరి 1న కొవ్వూరు మండలంలోని దొమ్మేరులో జరగవలసిన సీఎం నారా చంద్రబాబునాయుడు పర్యటన రద్దు అయింది. పేదల గృహ ప్రవేశాలు ప్రారంభం, పింఛన్ల పంపిణీతో పాటు ఇక్కడ సభ నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎమ్మెల్యేలు ఈ మేరకు సమీక్షలు నిర్వహించారు. బుధవారం కూడా క్షేత్రస్థాయి సీఎం పర్యటనకు అవసరం ఏర్పాట్లన్నీ సుమారుగా సిద్ధం చేశారు. కానీ ఎలక్షన్ కమిషన్ పలు ప్రాంతాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం షెడ్యూల్ ప్రకటించి, తక్షణమే కోడ్ అమలులోకి వస్తున్నట్టు ప్రకటించింది. కానీ సీఎం ప్రోగ్రాం ముందుగానే నిర్ణయించింది కావడంతో అనుమతి ఇవ్వవలసిందిగా ఎన్నికల సంఘానికి ప్రభుత్వ యంత్రాంగం లేఖ కూడా రాసింది. కానీ కోడ్ అమలులోకి రావడం వల్ల సీఎం సభ నిర్వహణ వీలుకాదని, అది కోడ్ పరిధిలోకే వస్తుందని ఎన్నికల సంఘం స్పష్టం చేయడంతో ఇక్కడ పర్యటన వాయిదా పడింది. కాగా ఎన్నికలు లేని అన్నమయ్య జిల్లాకు సీఎం సభను మార్చారు.

# భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రత్యేక చర్యలు : చింతమనేని



దెందులూరు (చైతన్యరథం): మహాశివరాత్రికి బలివే రామలింగేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. విజయరాయి దగ్గర తమ్మిలేరులో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన వేలసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని, తమ్మిలేరులో పుణ్యస్నానాలు ఆచరించి, పితృ దేవతలకు తర్పణాలు వదులుతారన్నారు. ఆ సమయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్నానాల ఘాట్లతో పాటు జల్లు స్నానాలకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పురోహితులకు ఒకపక్క ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉంటాయని, ఎటు వంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ నాయకులు పెదర్ల రాంబాబు, నానీ, దారిబోయిన సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# ఏపీని అప్పుల ఊబిలో ముంచేశాడు : కొనకళ్ల నారాయణరావు



మచిలీపట్నం (చైతన్యరథం): ఒక్కసారి ఛాన్స్ అంటూ బీద అరుపులకు చలించి ఆంధ్రప్రదేశ్ ప్రజలు అవకాశమిస్తే... రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో ముంచేసి ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించారని జగన్ రెడ్డిపై ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ మరియు కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయిదేళ్లలో కాలంలో జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేయగా, లక్షా 40 వేల కోట్ల రూపాయల మేర బకాయిలు పెట్టిందని, ఇప్పుడవి తమ ప్రభుత్వానికి గుది బండగా మారితే, ప్రజలకు శాపంగా పరిణమించాయని విరుచుకుపడ్డారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడు నెలల కాలంలో జగన్ ప్రభుత్వం బకాయి పెట్టిన ఆరోగ్యశ్రీ, ధాన్యం, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు రూ.22 వేల కోట్లను సీఎం చంద్రబాబునాయుడు చెల్లించారన్నారు. ఈ మేరకు బుధవారం చైర్మన్ నారాయణరావు కృష్ణా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక అసమర్థుడు పాలన వల్ల రాజ్యం ఎంతమేర నష్టానికి గురవుతుందో ఏపీని చూస్తే ఇట్టే అర్థమవుతుందన్నారు. 5 ఏళ్ల జగన్ పాలన వల్ల రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లడమే కాకుండా, అన్ని వ్యవస్థలూ నిర్వీర్యమైపోయాయన్నారు. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దివాళా తీసిందన్నారు. తన అసమర్థత, తుగ్లక్ నిర్ణయాలతో పాటు జల్సాలు, ఆడంబరాలు, ప్రచార యావ కోసం లక్షల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. 5 ఏళ్ల కాలంలో జగన్ రూ.10 లక్షల కోట్లు అప్పులు చేస్తే..వాటి అసలు, వడ్డీ తీర్చడానికి ఏడాదికి రూ.71 వేల కోట్లు అవసరమవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు.

## అయ్యప్పరాజుగూడెంలో పర్యటించిన ఎమ్మెల్యే రోషన్‌కుమార్



ఏలూరు (చైతన్యరథం): లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెంలో చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ గురువారం పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అక్కడ ఉన్న కూటమి నాయకులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మిస్తున్న డ్రైనేజీ సీసీ రోడ్లు క్వాలిటీతో పనులు చేయాలని కాంట్రాక్టర్లకు వివరించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు మండల జిల్లా కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నందిగామలో వైసీపీకి భారీ షాక్



నందిగామ (చైతన్యరథం): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేందుకు వైసీపీ నేతలు ఆసక్తి చూపిస్తున్నారు. నందిగామలో ఆ పార్టీ భారీ షాక్ తగిలింది. నందిగామ పట్టణ తెలుగుదేశం పార్టీ నేతల నేతృత్వంలో నందిగామ మున్సిపాలిటీకి చెందిన 18వ వార్డు కౌన్సిలర్ బండారు గంగమ్మ టీడీపీలో చేరారు. గురువారం నందిగామ పట్టణం కాకానీ నగర్ కార్యాలయంలో ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సమక్షంలో తెదేపాలో చేరారు. కార్యాలయంలో వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో ఓటమి నుంచి వైసీపీ గుణపాఠం నేర్చుకోలేదని, ప్రజా ప్రభుత్వంపై నిత్యం దుష్ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారని తంగిరాల సౌమ్య ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు.

## మహాత్ముని బాటలోనే అందరం పయనించాలి



మైలవరం (చైతన్యరథం): సంఘర్షణలన్నీ అహింసతోనే పరిష్కరించుకోవాలని బోధించిన మహాత్ముని బాటలోనే అందరం పయనించాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహాత్మునికి జోహార్లు అర్పించారు. జాతిపిత మహాత్మా గాంధీజీ జీవితం యావత్ ప్రపంచానికే స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి సమస్య శాంతి, అహింసతో పరిష్కరించబడాలనే మహాత్ముని ఆకాంక్ష ఎందరికో మార్గదర్శకమన్నారు. మనదేశ స్వాతంత్ర్య సముపార్జనలో మహాత్ముని కృషి అనిర్వచనీయమన్నారు.

## మహాత్మాగాంధీకి నివాళులర్పించిన దేవినేని ఉమా

మైలవరం (చైతన్యరథం): భారత జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు నివాళులర్పించారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ... భారతదేశానికి స్వతంత్రం చేకూర్చేందుకు మహాత్మా గాంధీ బ్రిటీష్ వారిపై అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. అహింసా, సత్యాగ్రహం సిద్ధాంతాలతో దేశ ప్రజలను ఐక్యపరిచారని తెలిపారు. స్వాతంత్ర పోరాటంలో భాగంగా ఆయన పలుమార్లు జైలుకు వెళ్లాల్సి వచ్చిందని,. దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని గుర్తించేందుకు, గాంధీజీ వర్ధంతిని అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



# జగన్ ఐదేళ్ల పాలనలో దివాళా తీసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ

## ●రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిన వైసీపీ... మండిపడ్డ యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ వ్యాఖ్యానించారు. గురువారం విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి హాయంలో చేసిన రూ.10 లక్షల కోట్ల అప్పుతో , ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, లక్షా 40 వేల కోట్ల రూపాయల వడ్డీ చెల్లింపు భారం రాష్ట్ర ఖజానాపై పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గడిచిన ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను ఇలా మొత్తం సుమారు రూ.22 వేల కోట్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించిందన్నారు. విద్యవస్థను, వైద్యఆరోగ్య వ్యవస్థను నాశనం చేసారని దుయ్యబట్టారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూ.450 కోట్లు, చిక్కిలు, కోడిగుడ్లు రూ.256 కోట్లు, ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.1800 కోట్లు, ఉద్యోగులకు బకాయిలు రూ.20 వేల కోట్లు, ఇరిగేషన్ కాంట్రాక్టర్ల బకాయిలు రూ.19వేల కోట్లు, గృహనిర్మాణం బకాయిలు రూ.7,800 కోట్లు, ఉపాధి హామీ బకాయిలు రూ.2,100 కోట్లు ఇలా మొత్తం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ.1.40 లక్షల కోట్లు ఉన్నాయని చెప్పారు. ఈ స్థాయిలో గతంలో ఏ ప్రభుత్వం ఇంతలా బకాయిలు పెట్టలేదని చెప్పారు. ఇలా తెచ్చిన అప్పులను ప్రభుత్వం ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం వంటి వాటిపైన కాకుండా జగన్‌మోహన్‌రెడ్డి విలాసాలు, జల్సాలకు ఖర్చు చేశారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి విలాసాలు, జల్సాలకు రూ.19,871.35 కోట్ల ప్రభుత్వ ధనం దుబారా చేశారన్నారు. రుషికొండపై విలావసవంతమైన భవనాల నిర్మాణానికి రూ.600 కోట్లు, ప్రకటనల పేరుతో తన సొంత పత్రిక సాక్షి పత్రికకు దోచిపెట్టిన మొత్తం రూ.500 కోట్లు, తాడేపల్లి ప్యాలెస్ నిర్వహణకు ప్రజాధనం ఖర్చు రూ.15.25 కోట్లు ,పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫోటోలకు రూ.13 కోట్లను ఖర్చు చేశారని వెల్లడించారు. అయిదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగోటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్‌కు అనుమతులు ఇలా ప్రతి దాంట్లో అశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లను జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన అనుచరణగణం దోచుకున్నారని అన్నారు.

# సోలార్ విద్యుత్‌పై పార్టీ నాయకులు విస్తృత ప్రచారం చేయాలి

## ●పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే గద్దె రామమోహన్



విజయవాడ (చైతన్యరథం): పీఎం సూర్యఘర్ పథకంపై టీడీపీ నాయకులు విస్తృత ప్రచారం చేసి ఎక్కువ మంది సోలార్ విద్యుత్‌ను వినియోగించే విధంగా చేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పిలుపునిచ్చారు. అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో గురువారం ఉదయం పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహనా సదస్సు జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... సోలార్ ప్యానల్స్‌ను అమర్చుకోవడం ద్వారా ప్రతి ఇంటిలోనూ విద్యుత్ బిల్లు చెల్లించకుండా కరెంట్‌ను వినియోగించుకోవచ్చునని అన్నారు. సోలార్ ఎనర్జీ గురించి పత్రికల్లో, టీవీల్లో వస్తున్న ప్రకటనలు చూసి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. బ్యాంకు రుణాలను తీసుకుని సోలార్ ప్యానల్స్‌ను అమర్చుకోవడం ద్వారా కరెంట్ బిల్లుకు చెల్లించే డబ్బులు కంటే చాలా తక్కువ మొత్తంలోనే బ్యాంకుకు చెల్లించవచ్చునని చెప్పారు. కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలో బ్యాంకు రుణం తీరిపోతుందని, అప్పుడు ఉచితంగానే కరెంట్‌ను వినియోగించుకోవచ్చునని వివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోలార్ విద్యుత్ గురించి అవగాహన పెంచుకుని విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. పీఎం సూర్యఘర్ ఎన్టీఆర్, కృష్ణా జిల్లా నోడల్ అధికారి భాస్కరరావు మాట్లాడుతూ... ప్రతి ఒక విద్యుత్ వినియోగదారుడికి 3 కిలో వాట్ సోలార్ విద్యుత్ ప్యానెల్‌కు ఏర్పాటు చేసుకుంటే రూ.78 వేలను ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు ఉచితంగానే సోలార్ ప్యానెల్స్‌ను అమర్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగానే ఈ సోలార్ ప్యానెల్స్ అందచేస్తామన్నారు. ఉమ్మడి ఎన్టీఆర్ జిల్లాలో 74 వేల మంది ఎస్సీ, ఎస్టీల ఇళ్ళకు సోలార్ ప్యానల్స్ అమర్చేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశామని, అతి త్వరలోనే సోలార్ ప్యానల్స్ అమర్చుతామని అన్నారు. సోలార్ ప్యానెల్ ఒక సారి అమరిస్తే 30 సంవత్సరాల వరకు పనిచేస్తాయని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలపై విద్యుత్ భారాలు పడకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ కార్యక్రమములో తెలుగుదేశం రాష్ట్ర పార్టీ కార్యదర్శి చెన్నుపాటి గాంధి, కార్పోరేటర్లు ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, దేవినేని అపర్ణ, ఇతర నాయకులు గద్దె క్రాంతి కుమార్, దేవరపల్లి ఆంజనేయులు, దాసరి గాబ్రియేలు, నందిపాటి దేవానంద్, దోమకొండ రవి, జక్కుల సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

# ఆచరణాత్మకమైన సాంకేతిక విద్యావిధానాన్ని అమలు చేయాలి



గుంటూరు (చైతన్యరథం): ఆచరణాత్మకమైన సాంకేతిక విద్యా విధానాన్ని అమలు చేయడంలో ప్రైవేట్ స్కూల్స్ ముందుండాలని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గుంటూరులోని స్థానిక వెల్‌కమ్ హొటల్లో గురువారం జరిగిన ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ 4వ వార్షికోత్సవ సమావేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ... స్కూళ్లలో పూర్తిస్థాయి సౌకర్యాలు చదువుకు మించిన కలలు విద్యార్థులకు అందించాలన్నారు. తల్లిదండ్రుల తర్వాత స్థానమైన గురువులు విద్యార్థులకు అన్ని విషయాల్లో మద్దతుగా ఉండాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నారా లోకేష్, తాను ఇలా మేమందరం కలిసి ప్రైవేట్ స్కూల్లో ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటామన్నాఆరు. ఆచరణాత్మకమైన సాంకేతిక విద్యావిధానాన్ని అమలు చేయడంలో ప్రైవేట్ స్కూల్స్ ముందుండాలని, ఇలాంటి సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులో ఉండని కారణంగా ఆయా సౌకర్యాలను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందజేయడంలో పారదర్శకత ప్రదర్శించాలన్నారు. పూర్తిస్థాయి అభివృద్ధి, విద్యావిధానం, విద్యావిధానం యొక్క పద్ధతి వంటివన్నీ తల్లిదండ్రులకు అర్థమయ్యేలా, పారదర్శకంగా తెలియజేయగలిగితే కచ్చితంగా మంచి విజయాలు సాధిస్తారని పెమ్మసాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఐఎస్ఎంఎ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ తప్పుడు ప్రచారాల్ని తిప్పికొట్టండి

## ●శ్రేణులకు పిలుపునిచ్చిన టీడీపీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి




గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో 2019 నుండి 2024 కాలం ఒక నియంత అయిన జగన్‌రెడ్డి చేతిలో విధ్వంస యుగమని, తప్పుడు నిర్ణయాలు, దోపిడీ, జల్సాల దెబ్బకి ఆంధ్రప్రదేశ్ కుదేలయిపోయిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గపార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమావేశం నిర్వహించి, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయటం లేదని చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పేర్కొంటూ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సి ఎన్నికల గురించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... నవరత్నాల పేరుతో మోసగాడు జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశాడని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తూ, రాష్ట్ర ప్రజలకి వాస్తవాలు వివరించే ప్రయత్నం చేశారు. అది తట్టుకోలేని జగన్‌రెడ్డి పార్టీ అతని విషపు పత్రిక ప్రజలను తప్పుదోవ పట్టించేలాగా నిస్సిగ్గుగా కథనాలు రాసిందని, జగన్‌రెడ్డి అండ్ కో ప్రచారం చేస్తున్నారని గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు పేదలకు అవసరమైన 123 పథకాలను నిలిపి వేసి, నవరత్నాలు పేరుతో కేవలం కొన్ని పథకాలను మాత్రమే ప్రజలకు అందించి ప్రజల జీవితాలను ఛిద్రం చేశాడన్నారు. తన దోపిడితో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎంత హీన స్థితికి దిగ జార్చాడో నీతిఆయోగ్ నివేదిక స్పష్టం చేసిందని, అప్పులు చేసిన జగన్‌రెడ్డి చివరకు అప్పు కూడా ఎక్కడా పుట్టని స్థితికి రాష్ట్రాన్ని తీసుకొనివచ్చారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ప్రభుత్వం సూపర్ 6 హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నది. ఇప్పటికే కొన్ని చేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూ, కేవలం ఆరు నెలల్లో మొత్తం ఆరున్నర లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చి సరికొత్త రికార్డు సృష్టించామని గళ్ళా మాధవి తెలిపారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యింది 2019 మే 30న అని, రైతు భరోసాను అమలు చేసింది 2019 అక్టోబర్‌లో అని, అమ్మఒడి అమలు చేసింది 2020 జనవరిలో అని, చేదోడు అమలు చేసింది 2022 ఫిబ్రవరిలో అని, జగనన్న తోడు ఎన్నికల ముందు అమలు చేశారని ఇవన్నీ వైసీపీ నేతలు గుర్తుపెట్టుకొని మా సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి మాట్లాడితే బాగుంటుంది అని, లేకపోతే ఈసారి 11 సీట్లు కూడా రావని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. అనంతరం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు చరవాణిలో ఆదేశాలు జారీ చేశారు.

# పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో కూటమి ప్రభుత్వం రికార్డు



నరసరావుపేట (చైతన్యరథం): పెట్టుబడులు,ఉద్యోగాల కల్పనలో కూటమి ప్రభుత్వం రికార్డు సాధించిందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ వ్యాఖ్యానించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాల కోసం కల్పనలో కూటమి ప్రభుత్వం సరికొత్త రికార్డులు నెలకొల్పుతుందని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ప్రాంతానికీ కొత్త పరిశ్రమ వచ్చేలా.. ప్రతి ప్రాంతం ఒక్కో రంగంలో గుర్తింపు పొందేలా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ లక్షల కోట్లు పెట్టుబడులు ఆకర్షిస్తున్న ఫలితాలు త్వరలోనే అందరూ చూస్తారని అన్నారు. చంద్రబాబు దీర్ఘకాలిక లక్ష్యాల్లో ప్రస్తుతం చూస్తున్న ఫలితాలు ప్రారంభం మాత్రమేనని, కేవలం ప్రభుత్వం వచ్చిన 7 నెలల్లో రూ.6,33,568కోట్ల పెట్టుబడులతో 4లక్షల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చే సాహసం ఎక్కడైనా జరిగిందా అని కొమ్మాలపాటి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, అమరావతి, రాయలసీమ ప్రాంతాలను అభివృద్దే లక్ష్యంగా చేసుకొని, అందు కోసం రాష్ట్రానికి 20 భారీ పరిశ్రమలను రాష్ట్రానికి సాధించుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకి, మంత్రి లోకేష్‌కే దక్కుతుందన్నారు. మాజీ సీఎం జగన్ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన కొమ్మాలపాటి... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాకపోవటం సిగ్గుచేటన్నారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చినా.. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చినా.. జగన్ అండ్ గ్యాంగ్‌కు ఎప్పుడూ ఏడుపేనని, జాబ్ క్యాలెండర్ అని అయిదేళ్లు రాష్ట్ర యువతను మోసం చేసి... మాఫియా తరహా పాలనతో పరిశ్రమలను తరిమేసిన వ్యక్తికి అసలిప్పుడు మాట్లాడే నైతిక అర్హత ఉందా అని కొమ్మాలపాటి శ్రీధర్ నిలదీశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# భరత మాత తలరాత మార్చిన విధాత జాతిపిత



పల్లిపాడు గాంధీ ఆశ్రమాన్ని దక్షిణ భారత సబర్మతిగా మారుస్తాం

## ◆కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఘన నివాళి

## ◆పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలో ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి

కోవూరు (చైతన్యరథం): సత్యం, అహింస అనే ఆయుధాలతో బ్రిటిష్ వారి కబంధ హస్తాల నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన పూజ్య బాపూజీ శాంతి మార్గం నేటి యువతకు ఆదర్శం కావాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలోని బాపూజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. గాంధీ ఆశ్రమంలో విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు సభికులను అలరించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ అడుగడుగునా పూజ్య బాపూజీ జ్ఞాపకాలతో ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల స్పర్శతో పులకించిన పల్లిపాడు గాంధీ ఆశ్రమానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సర్వజన హితమే నా మతమని చాటి చెప్పిన మహాత్మా గాంధీ మహోన్నత మానవతావాది అని కొనియాడారు. భారతదేశానికి జాతిపిత అయ్యారని అన్నారు. ఎందరో స్వాతంత్ర్య పోరాటయోధులకు స్వరాజ్య స్ఫూర్తిని రగిల్చిన పల్లిపాడు గాంధీ ఆశ్రమాన్ని మరో సబర్మతి ఆశ్రమంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. ఆ ప్రయత్నంలో భాగంగానే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకొని తన ఎంపి నిధులతో రోడ్లు, డ్రైన్లు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు.

మహాత్ముడి స్వహస్తాలతో ప్రారంభమైన గాంధీ ఆశ్రమ ఘనచరిత్ర భావితరాలకు తెలిపేలా పల్లిపాడును మరో సబర్మతిగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యేగా తాను, ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయ కుమార్‌రెడ్డి, గాంధీ ఆశ్రమ కన్వీనర్ కల్పనమ్మ, గునపాటి ప్రసాద్‌రెడ్డి, రెడ్‌క్రాస్ డైరెక్టర్ యాలమూరి రంగయ్య నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్ర నాయుడు, టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### మహాత్మాగాంధీ మార్గం సర్వత్రా అనుసరణీయం: కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి: మహాత్మాగాంధీ మార్గం సర్వత్రా అనుసరణీయం, శ్రేయస్కరమని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని కావలి ట్రంక్ రోడ్డులో గాంధీ విగ్రహానికి కూటమి నేతలతో కలిసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో అహింస, సత్యాగ్రహం అన్నింటికన్నా శక్తివంతమైన ఆయుధాలని నిరూపించిన మహనీయులు మహాత్మా గాంధీ అన్నారు. శాంతియుత ఉద్యామాలు, ఓర్పు, సహనమే ఆసరాగా శతాబ్దాల బ్రిటిష్ పాలకుల దాస్య శృంఖలాలను తెంచి భారత జాతికి స్వేచ్ఛా వాయువులు ప్రసాదించిన కారణ జన్ముడు గాంధీ అని కొనియాడారు. హింస, అశాంతి నెలకొన్నచోట మానవ మనుగడ, అభివృద్ధికి అవకాశం ఉండదని ప్రపంచ వ్యాప్తంగా అనేక దృష్టాంతాలు నిరూపిస్తున్న క్రమంలో మహాత్ముడు చూపిన శాంతి మార్గమే శ్రేయస్కరమని ఎమ్మెల్యే కావ్య అన్నారు.

# కూటమి ప్రభుత్వానికి గుదిబండలా జగన్ అప్పులు

## ◆ కావలి ఎమ్మెల్యే దగుమాట్టి విమర్శ



కావలి (చైతన్యరథం): జగన్ చేసిన అప్పులు కూటమి ప్రభుత్వానికి గుదిబండలా తయారయ్యాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ గడిచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు 22 వేల కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఏడాదికి 71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాలని ఇవి ప్రభుత్వానికి గుదిబండలా మారాయన్నారు. జగన్ ప్రభుత్వం రూ. 1.40 లక్షల కోట్లు ఉన్నాయని, ఈ స్థాయిలో గత ఏ ప్రభుత్వం బకాయి పెట్టలేదన్నారు. తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలు, జల్సాలకు ఖర్చు చేసి తినేసారని మండిపడ్డారు. జగన్ విలాసాలు, జల్సాలకు ప్రభుత్వ ధనం దుబారా సుమారు రూ. 19,871.35 కోట్లని తెలిపారు. ఐదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్ రెడ్డి రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని అన్నారు. భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్‌కు అనుమతులు, ఇలా ప్రతిదాంట్లో ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారని మండిపడ్డారు. ప్రతి దాంట్లో చేతివాటం చూపారన్నారు. వీటన్నింటితో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ దివాళా తీసి, నేటి కూటమి ప్రభుత్వానికి గుదిబండగా తయారై, ప్రజల పాలిట శాపంగా మారిందని తెలిపారు.

# అటవీ భూములు కబ్జా చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

## ◆చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు డాక్టర్ సిఆర్ రాజన్ విమర్శ

చిత్తూరు (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలకు నిదర్శనమే పుంగనూరులో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించుకున్న అటవీ స్థలమే నిదర్శనం అని చిత్తూరు జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సిఆర్ రాజన్ విమర్శించారు. చిత్తూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 23 ఎకరాల రెవిన్యూ స్థలాన్ని ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా పత్రాలు సృష్టించి అటవీశాఖకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకోవడం దారుణమన్నారు. అక్రమంగా ఆక్రమించుకున్న స్థలానికి మళ్ళీ ప్రభుత్వ నిధులతో రోడ్డు నిర్మించుకొని అందులో జగన్ లాంటి ప్యాలెస్ కట్టుకొని ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆక్రమించుకున్న అటవీశాఖ స్థలాన్ని తిరిగి అటవీ శాఖకు తిరిగి ఇవ్వాలని, ఉపయోగించుకున్న ప్రభుత్వ నిధులను తిరిగి చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు దొరబాబు, చుడా చైర్మన్ కటారి హేమలత, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి వి.సురేంద్రబాబు, చిత్తూరు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, చిత్తూరు జిల్లా టీడీపీ మహిళా అధ్యకురాలు అరుణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



### అడవిని మింగేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

#### తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ ధ్వజం

తిరుపతి: మంగళంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎకరాలకొద్దీ అటవీ భూముల్ని దర్జాగా కబ్జా చేసి, దానిని వ్యవసాయ క్షేత్రంగా మార్చేసి, విలాసవంతమైన భవనం నిర్మించుకున్నారని తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ విమర్శించారు. అలాగే అక్కడకు వెళ్ళడానికి అటవీభూమిలో ప్రభుత్వ సొమ్ముతో రహదారి కూడా నిర్మించారని తెలిపారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసింహ యాదవ్ మాట్లాడుతూ, ఆ ప్రాంతంలోకి పెద్దిరెడ్డికి తెలియకుండా ఏ ఒక్కరు అడుగు పెట్టడానికి వీలులేకుండా కట్టుదిట్టంగా ఇనుప కంచె కూడా వేశారని అన్నారు. పెద్దిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్ల మండలం మంగళంపేట సమీపంలోని అడవుల్లో.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా పెద్దిరెడ్డి అక్రమ అటవీ సామ్రాజ్యం నిర్మించుకున్నారని అన్నారు. అసైన్డ్, అటవీ భూముల్ని ఆక్రమించుకుని విలాసవంతమైన భవనాలు కట్టుకుని అనుభవించడం వైకాపా నాయకులకే చెల్లుతుందన్నారు. పెద్దిరెడ్డి అటవీ శాఖ మంత్రిగా ఉండీ... అడవి మధ్యలోని తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లేందుకు రొంపిచెర్ల మార్కెట్ కమిటీ నిధులతో నిబంధనలకు విరుద్ధంగా తారు రోడ్డు వేసేసుకున్న ఘనుడు అని అన్నారు.



# సేవే లక్ష్యంగా నిరంతర వైద్య శిబిరాలు

## ◆దివ్యాంగుల సహాయార్థం క్యాంపు ఏర్పాటు

## ◆భారీగా తరలివచ్చిన దివ్యాంగులు, వయో వృద్ధులు

మార్కాపురం (చైతన్యరథం): సేవే లక్ష్యంగా ప్రజల కోసం నిరంతర వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తానని మార్కాపురం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. మార్కాపురంలోని అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం ఎఎల్ఐఎంసీఒ, జిల్లా వికలాంగ సంక్షేమ శాఖ సహకారంతో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయో వృద్ధులకు అవసరమైన ఉపకరణాల గుర్తింపు శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారితో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి భరోసా కల్పించారు. ఎంపికైన వారికి ఓ నెలలో ఉచితంగా ట్రై సైకిల్స్, వీల్ ఛైర్స్, బ్యాటరీ ట్రై సైకిల్స్, చేతికర్రలు, సంక కర్రలు తదితర ఉపకరణాలు పంపిణీ చేస్తామన్నారు.

శిబిరంలో పాల్గొన్న వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. శిబిరంలో దివ్యాంగులు, వికలాంగులు, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు సుమారు 600 మంది పాల్గొనగా అర్హులు అయిన వారిని గుర్తించి నెల రోజుల తరువాత ఉచితంగా ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు. దివ్యాంగులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో వయో వృద్ధుల సహాయ సంస్థ మేనేజర్ జీ అర్చన, సిబ్బంది, మానవత సంస్థ సోమిశెట్టి శ్రీనివాసులు, ఎఎల్ఐఎంసీఒ ప్రతినిధులు, షేక్ జంషేర్ అహ్మద్, దొరసాని, రెహ్మాన్, కరీముల్లా, తులసి, పార్వతి, అమ్ములు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి వైద్య శిబిరాలకు సహకరించండి

## ◆అపోలో హాస్పిటల్స్ యాజమాన్యాన్ని కోరిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి (చైతన్యరథం): శ్రీకాళహస్తిలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాలకు సహకరించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అపోలో హాస్పిటల్స్ యాజమాన్యాన్ని కోరారు. వైద్య శిబిరాల ఏర్పాటుపై గురువారం చెన్నైలోని అపోలో హాస్పిటల్స్ మెయిన్ బ్రాంచ్ సిఇఒ నవీన్, సీనియర్ వైద్యులు, వైద్య నిపుణులతో ఎమ్మెల్యే బొజ్జల సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఫిబ్రవరి 21 నుండి మార్చి 4వ తేదీ వరకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిక్షణ పొందిన వైద్య సిబ్బందిని నియమించడం, అత్యవసర వైద్య పరికరాలను అందించాలని కోరారు. అపోలో హాస్పిటల్స్ సిఇఒ నవీన్ ఈ కార్యక్రమానికి పూర్తి మద్దతు అందిస్తామని తెలిపారు. అపోలో కీలకమైన ప్రదేశాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందని, పండుగ సమయంలో సమర్థవంతమైన అత్యవసర వైద్యానికి వైద్యులు, నర్సులు, పారామెడిక్‌లను నియమిస్తుందని తెలిపారు. ప్రజారోగ్యం పట్ల అపోలో హాస్పిటల్స్ యాజమాన్యం చూపిన అంకితభావానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




# రైతులకు స్ప్రింక్లర్లు అందజేసిన మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ (చైతన్యరథం): ఉరవకొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు స్ప్రింక్లర్లు, డ్రిప్పు పరికరాలను పయ్యావుల కేశవ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, నియోజకవర్గ రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



### మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన మంత్రి

ఉరవకొండ పట్టణంలోని పాతపేటలో ఉన్న జిల్లా పరిషత్ (సెంట్రల్) ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలసి చేశారు. అనంతరం భోజనం ఎలా ఉంది, కోడిగుడ్లు అందిస్తున్నారా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.




# మహాత్మాగాంధీ అడుగుజాడలు ఆదర్శనీయం

### ◆మంత్రి సవిత నివాళులు

పెనుకొండ (చైతన్యరథం): జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడలు ఆదర్శనీయమని బీసీ సంక్షేమ. చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో మహాత్మాగాంధీ 77వ వర్ధంతి సందర్భంగా క్యాంపు కార్యాలయం, గాంధీ సర్కిల్‌లోని గాంధీ విగ్రహానికి మంత్రి సవిత పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎంతో మందికి స్ఫూర్తి, నింపారని, శాంతి అహింస అనే నినాదంతో తెల్లవాళ్ళను పారదోలి, భారతావనికి స్వేఛ్ఛా స్వాతంత్ర్యం అందించారన్నారు. ప్రతిఒక్కరు గాంధీజీ ఆశయాలను కొనసాగించాలని తెలిపారు.

వైసీపీ దుష్టపాలనకు ప్రజలు చరమగీతం పాడారని మంత్రి అన్నారు. నేడు ఇది మంచి ప్రభుత్వమని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గురువారం వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రారంభించామని, తద్వారా ప్రజలకు 161 సేవలు వాట్సప్ ద్వారా అందనున్నాయన్నారు. 11 సీట్లకు పరిమితమైన వైసిపి నేడు కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హతలేదని లేదన్నారు. కేవలం వాళ్ళ ఉనికి చాటుకోవడానికే కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ ఖచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. త్వరలో తల్లికి వందనం పథకంతో పాటు మరికొన్ని పథకాలు అందిస్తామన్నారు. తప్పకుండా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ దావోస్ వెళ్లివచ్చాక ఏపికి భారీగా పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తి నింపిన గాంధీ

కర్నూలు (చైతన్యరథం): అహింసే ఆయుధంగా ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తి నింపిన మహాత్ముడు గాంధీ అని టీడీపీ నేతలు నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి ఆధ్వర్యంలో కర్నూలులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్టీ ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు జాతిపిత మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశానికి వ్యాపారం కోసం వచ్చిన ఆంగ్లేయులు చిన్నచిన్నగా వారి సామ్రాజ్యాన్ని విస్తరింపచేసుకొని భారతీయులను ఎన్నో ఇబ్బందులపాలు చేసి చిత్రహింసలకు గురిచేస్తున్న సమయంలో వారి పాలననుండి స్వతంత్ర్య భారతావని కోసం ఎంతో మంది పోరాటాలు సాగించారనీ, వారిలో మహాత్మగాంధీ ఒకరని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని సిద్దింపజేసేందుకు దేశం మొత్తం కలియ తిరుగుతూ ప్రజలలో చైతన్యం తీసుకొచ్చిన మహనీయుడు జాతిపిత అని కొనియాడారు. అలాంటి మహనీయుని అడుగుజాడల్లో నేటి యువతరం ముందుకు వెళ్లాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.నాగేంద్రకుమార్, దాశెట్టి శ్రీనివాసులు, యస్. నవీన్, జె. తిరుపాల్ బాబు, బొగ్గుల ప్రవీణ్, రెడ్డిపోగు బజారన్న, సత్రం రామక్రిష్ణుడు, దరూర్ జేమ్స్, పి.హనుమంతరావు చౌదరి, యల్.వి. ప్రసాద్, అఖిల్, షేక్షావలి. బి. శ్రీనివాసులు, బేత క్రిష్ణుడు, తదితరులు హాజరయ్యారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

### ◆ఏ సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకురండి
### ◆పీహెచ్‌సీ వైద్యులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన



అనంతపురం (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా పని చేయాలని వైద్యులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, కురుగుంట, రాప్తాడు, కనగానపల్లి, నాగసముద్రం గేట్, రామగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో గురువారం ఎమ్మెల్యే సునీత సమావేశం నిర్వహించారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. మీ ఆసుపత్రుల పరిధిలో రోజు ఎంత మంది ప్రజలు వైద్యం కోసం వస్తున్నారు.. ఎంత మంది వైద్యులు, సిబ్బంది ఉన్నారనే విషయంపై ఆరా తీశారు. ఉదయం నుంచి ఎప్పటి వరకు అందుబాటులో ఉంటారు.. రాత్రి వేళల్లో పరిస్థితి ఏమిటన్నది తెలుసుకున్నారు. అదే సమయంలో వైద్యులు కొన్ని సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రుల్లో అవసరమైన వాటర్ ప్లాంట్స్, షెడ్స్, ల్యాబ్, బెడ్స్, మంచాలు, కంప్యూటర్స్, ప్రింటర్స్, మూడు సీట్ల కుర్చీలు, ఫర్నిచర్, తదితర అవసరాలను గుర్తించాలన్నారు. వీటిపై అన్ని వివరాలు అందిస్తే వాటిని సమకూరుస్తామన్నారు. ప్రజల పట్ల మీరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో చిన్న వాటికి కూడా అనంతపురం వెళ్లాలని సూచించవద్దని.. ఏదైనా ప్రమాదం అనిపిస్తేనే పెద్దాసుపత్రికి రెఫర్ చేయాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యులు కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.



### ప్రజలకు సత్వర సేవలు..

# వాట్సప్ గవర్నెన్స్ అద్భుతం


### ◆సద్వినియోగం చేసుకోండి
### ◆ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
### ◆సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

అనంతపురం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఏపీలో పరిపాలనా విధానం ప్రపంచానికే రోల్ మోడల్‌గా మారుతోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గురువారం వాట్సప్ గవర్నెన్స్ ప్రారంభించిన నేపథ్యంలో ఆయన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ప్రజల వద్దకే పాలన తెచ్చామని గొప్పలు చెప్పుకున్న వైసీపీ నాయకులు చిన్న సమస్యను కూడా పరిష్కరించలేకపోయారన్నారు. పనుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు తప్ప ప్రజలకు పని అయింది లేదన్నారు. ఇలాంటి ఎన్నో అంశాలు మంత్రి నారా లోకేష్‌కు యువగళం పాదయాత్ర ద్వారా తెలిశాయన్నారు. అందుకే అప్పట్లోనే ఇలాంటి గవర్నెన్స్ తీసుకురావాలని ఆలోచించారన్నారు. దేశంలోనే తొలిసారిగా ఇలాంటి వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చారన్నారు. ఈ విధానం ద్వారా ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. తొలి విడతలో దేవాదాయ, విద్యుత్, ఆర్టీసీ, రెవెన్యూ, అన్నక్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపాల్ శాఖల్లో 161 సేవలు అందించనున్నట్టు చెప్పారు. దీని ద్వారా వేగంగా పౌరసేవలు, పారదర్శకత, జవాబుదారీతనంలో భాగంగా వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. రెండో విడతలో వాట్సాప్‌లో 360 సేవలను అందుబాటులో ఉంచుతారన్నారు. ప్రజలు గతంలోగా ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పొందవచ్చున్నారు. ప్రతి సర్టిఫికెట్ పైన క్యూఆర్ కోడ్ ఉంటుందని.. వాట్సాప్ గవర్నెన్స్‌తో ఎక్కడా నకిలీకి ఆస్కారం ఉండదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవల్ని 9552300009 వాట్సాప్ నెంబర్ ద్వారా ప్రజలు పొందవచ్చని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# తిరుపతి ఘటనలో గాయపడిన కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థికసాయం

### ◆టీటీడీ చెక్కు అందించిన బోర్డు మెంబర్ ఎం.ఎస్.రాజు

అనంతపురం (చైతన్యరథం) : వైకుంఠద్వార దర్శనం టిక్కెట్ల కౌంటర్ వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాటలో తీవ్ర గాయాలపాలైన బాధితురాలికి మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు ఆర్థికసాయాన్ని టీటీడీ తరపున అందించారు. అనంతపురంలోని తన నివాసంలో గురువారం బాధితురాలు కర్నాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ఎం.శ్రీదేవికి ఎం.ఎస్.రాజు టీటీడీ తరపున రూ. 2లక్షల ఆర్థికసాయాన్ని చెక్కు ద్వారా అందించారు. తమను ఆదుకున్న ఏపీ ప్రభుత్వానికి, టీటీడీ పాలకమండలి బోర్డుకి శ్రీదేవి, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.







పెనుకొండ నియోజకవర్గంలో

# అన్ని చెరువులకు సాగునీరందేలా చర్యలు

- మంత్రి సవిత స్పష్టీకరణ
- హంద్రీ-నీవా కాలువ పనులు పరిశీలించిన మంత్రి
- కాలువల మరమ్మతులు వెంటనే పూర్తిచేయండి
- అధికారులకు మంత్రి ఆదేశం

పెనుకొండ (చైతన్యరథం): పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సాగునీరందేలా చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలో రైతన్నలకు ఏ కష్టం వచ్చినా వారికి వారికి అన్నివిధాలా అండగా ఉంటానని మంత్రి తెలిపారు. రొద్దం మండలం బొక్సంపల్లి సబ్ స్టేషన్ వద్ద ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ మడకశిర బ్రాంచ్ కెనాల్ ప్రధాన కాల్వను ఇరిగేషన్ అధికారులతో కలిసి మంత్రి సవిత పరిశీలించారు. కాలువ పూర్తిగా పూడికలతో నిండిపోవడాన్ని గమనించారు. కాలువ పనులు పూర్తయ్యితే పెనుకొండ నియోజకవర్గంలోని చెరువులతో పాటు హిందూపురం ,మడకశిర నియోజకవర్గంలో ని చెరువుల కూడా నీరు వెళుతుందని వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో వైసిపి ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను గాలికి వదిలేసారని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ రాకతో వేలాది ఎకరాలకు సాగునీరు అందించగలుగుతున్నామని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాన కాలువలతో పాటు పిల్లకాలువల్లోని పూడికలు తొలగించి రైతుల కళ్లల్లో ఆనందం నింపామన్నారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అన్నదాతకే మొదటి ప్రాధాన్యం అని చెప్పిన వైసీపీ ప్రభుత్వం అన్నదాత వెన్ను విరిచిందన్నారు. గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది తప్ప అదంతా చేతల్లో కనిపించలేదని విమర్శించారు. నిజంగా రైతుల పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో చెప్పడానికి కాలువల్లో పూడికతీత పనులు చేయకపోవడమే నిదర్శనమన్నారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం చంద్రబాబునాయుడు రైతులకు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజలకు మంచి చేస్తుంటే వ్యతిరేకిస్తారా?

- వాట్సాప్ గవర్నెన్స్‌పై ధన్యవాద తీర్మానాన్ని అడ్డుకున్న వైసీపీ సభ్యులు
- అనంతపురం జెడ్పీ సమావేశంలో వైసీపీ సభ్యులపై ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఫైర్

అనంతపురం (చైతన్యరథం) : ప్రజలకు మంచి చేస్తుంటే వ్యతిరేకిస్తారా? అంటూ మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు వైసీపీ సభ్యులపై మండిపడ్డారు. అనంతపురం జెడ్పీ సమావేశం గురువారం జరిగింది. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇంటివద్ద నుండే వాట్సాప్ ద్వారా సేవలు అందించే బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనిపై వైసీపీ సభ్యులు లేనిపోని రాద్ధాంతం చేయడంతో వైసీపీ సభ్యుల ప్రవర్తనపై ఎం.ఎస్.రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని అభినందించాల్సిన సభ్యులు వ్యతిరేకించడం ఏమిటని వైసీపీ సభ్యులను నిలదీశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తే లేవని నోరు, నేడు ప్రజలకు మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని వ్యతిరేకించడానికి ఎందుకు నోరు లేస్తోందని నిలదీశారు. గత ఐదేళ్లలో జిల్లా అభివృద్ధికి జగన్ రెడ్డి ఏం ఇచ్చాడో చెప్పాలని జెడ్పీ చైర్మన్‌ను నిలదీస్తే, నోరుమెదిపే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. జెడ్పీ సమావేశంలో వైసీపీ సభ్యుల అడ్డగోలు ప్రవర్తనను ఎం.ఎస్.రాజు తీవ్రంగా తప్పుబట్టారు.



## ఏపీలో గవర్నన్స్ ప్రపంచానికే రోల్ మోడల్

- ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ
- వాట్సప్ గవర్నెన్స్‌ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజలకు పిలుపు

పుట్టపర్తి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో ఏపీలో సుపరిపరిపాలన విధానం ప్రపంచానికే రోల్ మోడల్‌గా మారుతోందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్రంలో వాట్సప్ గవర్నెన్స్ ప్రారంభించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడుతూ, గతంలో ప్రజల వద్దకే పాలన తెచ్చామని గొప్పలు చెప్పుకున్న వైసిపి నాయకులు చిన్న సమస్యను కూడా పరిష్కరించలేక పోయారన్నారు. ప్రజల సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు తప్ప ప్రజలకు జరిగిన ప్రయోజనం లేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలపై ఎన్నో అంశాలు టీడీపీ యువ నాయకుడు నారా లోకేష్‌కు యువగళం పాదయాత్ర ద్వారా తెలిశాయన్నారు.దేశంలోనే తొలిసారిగా ఇలాంటి వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చిన ఏపి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో మంత్రి నారా లోకేష్ ఆలోచనతో ఈ విధానం ద్వారా ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. తొలి విడతలో దేవాదాయ, విద్యుత్, ఆర్టీసీ , రెవెన్యూ, అన్నక్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపాల్ శాఖల్లో 161 సేవలు అందించనున్నట్టు చెప్పారు. దీని ద్వారా వేగంగా పౌరసేవలు, పారదర్శకత, జవాబుదారీతనంలో భాగంగా వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. రెండో విడతలో వాట్సాప్‌లో 360 సేవలను అందుబాటులో ఉంచుతారన్నారు. ప్రజలు గతంలోగా ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పొందవచ్చన్నారు. ప్రతి సర్టిఫికెట్ పైన క్యూఆర్ కోడ్ ఉంటుందని.. వాట్సాప్ గవర్నెన్స్‌తో ఎక్కడా నకిలీకి ఆస్కారం ఉండదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవల్ని 9552300009 వాట్సాప్ నెంబర్ ద్వారా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు.

# తాగునీటి పైప్‌లైన్‌కు అడ్డంకులు తొలగించి నిధులివ్వండి

- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరిన ఎమ్మెల్యే పరిటాల సునీత
- పీఏబీఆర్ నుంచి చెరువులకు నీరు వచ్చే నెల 15 వరకు పొడిగించాలి

అనంతపురం (చైతన్యరథం): రాప్తాడు నియోజకవర్గంలో తాగునీటి పైప్ లైన్ల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటుకున్న అడ్డంకులను పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లో ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో కలసి కలెక్టర్‌ను కలిశారు. అంతకముందు రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో ఉన్న తాగునీటి సమస్య, పైప్ లైన్ నిర్మాణాలు తదితర వాటి గురించి చర్చించారు. అధికారుల నుంచి అన్ని వివరాలు తీసుకున్న తర్వాత కలెక్టర్‌ను కలిశారు. ఆత్మకూరు, రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాలకు తాగునీటి పైప్ లైన్స్ ఏర్పాటు గురించి చర్చించారు. పంపనూరు ఫారెస్ట్‌లో 2.1 కిలోమీటర్లు క్లియరెన్స్, వేపచెర్ల – గొరిదిండ్ల ఫారెస్ట్‌లో 1కిలోమీటర్ క్లియరెన్స్, కూడేరు మండలం చోళసముద్రం గ్రామంలో పైప్ లైన్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ పెండింగ్ పనులు పూర్తైతే పాపంపేట, కక్కలపల్లి కాలనీలకు నీరు త్వరగా వస్తుందన్నారు. జలజీవన్ పథకం కింద పీఏబిఆర్ నుంచి ఆత్మకూరు మండలంలోని 25 గ్రామాలకు, అనంతపురం రూరల్ మండలంలోని 23 గ్రామాలకు తాగునీరు ఇవ్వాలనే ప్రతిపాదనలో భాగంగా ఆత్మకూరు మండలానికి రూ. 35 కోట్లు మంజూరు చేయగా.. రూ.28కోట్ల పనులు జరిగినట్టు వివరించారు. అనంతపురం రూరల్ మండలానికి 26కోట్లు మంజూరు చేయగా



9కోట్ల పనులు జరిగాయన్నారు. రాప్తాడు మండలానికి 3కోట్లు మంజూరు చేయగా ఎలాంటి పనులు జరగలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్.డి.ఏ ప్రభుత్వం వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందని.. ఇందులో భాగంగా ఈ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. అలాగే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా గ్రామాల్లో ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. మరికొన్ని చోట్ల బోర్ల నీటి లభ్యత గురించి ముందే తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రాప్తాడు సమీపంలో జాకీ పరిశ్రమ కోసం స్థలం కేటాయించి.. పనులు చేపడితే.. అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లతో పరిశ్రమ ఏర్పాటు కాలేదన్నారు. ఇప్పుడు మన ప్రభుత్వం తరుపున జాకీ పరిశ్రమతో మళ్లీ సంప్రదింపులు జరిపి.. తిరిగి పరిశ్రమ ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. జాకీ పరిశ్రమ అంగీకరించకపోతే.. కొత్తగా గార్మెంట్స్ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలన్నారు. మరోవైపు పీఏబిఆర్ కుడికాలువ చెరువులకందించే నీరు ఇప్పటికే నిలిపివేశారని.. అయితే కనీసం 20శాతం కూడా చెరువులు నిండలేదన్నారు. ఈ చెరువులకు కనీసం 50 నుంచి 60శాతం వరకు అయినా నింపితే వేసవిలో సాగు, తాగునీటి సమస్య ఉండదన్నారు. వచ్చే నెల 15వరకు చెరువులకు నీరందించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులు కాకుండా వెడల్పు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. లైనింగ్ చేస్తే.. చాలా వరకు రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. రైతుల తరుఫున ఈ విజ్ఞప్తిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యే సునీత చెప్పిన అన్ని అంశాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తన పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తామని.. కొన్ని ముఖ్యమంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ జిల్లాలో టూరిజంకు సంబంధించిన Eternalan antha (శాశ్వతమైన అనంతపురం) పేరుతో హెరిటేజ్ టూరిజం సర్క్యూట్, ఎకో టూరిజం సర్క్యూట్, రిలీజియస్ సర్క్యూట్, అనంతపురం క్లస్టర్, కళ్యాణదుర్గం క్లస్టర్, తాడిపత్రి క్లస్టర్ బ్రోచర్లను ఎమ్మెల్యే పరిటాల సునీతకు అందజేశారు. జిల్లాలో ప్రాచీన దేవాలయాలు, కట్టడాలు వాటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మహా కుంభమేళాలో భారీ అగ్నిప్రమాదం



ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాలో తొక్కిసలాట ఘటన మరవకముందే గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సెక్టర్ 22లో ఛత్నాగ్ ఝూన్సీ ప్రాంతంలో నిర్మించిన టెంట్ సిటీలో గురువారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో పన్నెండుకు పైగా టెంట్లు కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా శ్రమించింది. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, కుంభమేళా ప్రారంభమైన 18 రోజుల వ్యవధిలోనే అక్కడ అగ్నిప్రమాదం జరగడం ఇది మూడోసారి.

తొలుత ఈనెల 19వ తేదీన మహా కుంభమేళాలో భారీ అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఎల్పీజీ సిలిండర్ పేలడంతో సెక్టార్ 19లో మంటలు చెలరేగి 18 గుడారాలు ఆహుతయ్యాయి. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. నల్లటి దట్టమైన పొగలు అలుముకోవడంతో అఖాడాల సమీపంలో భయాందోళన నెలకొంది. సాయంత్రం 4 గంటలకు మంటలు అంటుకోగా గంటలోపలే మంటలు అదుపులోకి వచ్చాయని అధికారులు తెలిపారు.

ఆ తర్వాత వారం రోజులకే అంటే ఈనెల 25వ తేదీన మరోసారి అగ్నిప్రమాదం జరిగింది. కుంభమేళాకు వెళ్లే ప్రధాన రహదారిలోని సెక్టార్ 2 సమీపంలోని పార్కింగ్ ఏరియాలో మంటలు చెలరేగాయి. అక్కడ విపరీతమైన వేడి కారణంగా మంటలు చెలరేగినట్లు అధికారులు చెప్పారు. ఈ ఘటనలో ఓ కారు పూర్తిగా దగ్ధం కాగా, మరో కారు పాక్షికంగా దెబ్బతిన్నట్లు వెల్లడించారు. అయితే, ఈ రెండు ఘటనల్లో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.

## భద్రత మరింత కట్టుదిట్టం

### తొక్కిసలాట ప్రదేశాన్ని పరిశీలించిన యూపీ సీఎస్, డీజీపీ

మహా కుంభమేళాలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని ఆ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ మనోజ్‌కుమార్ సింగ్, డీజీపీ ప్రశాంత్‌కుమార్ పరిశీలించారు. గురువారం ఉదయం ఉన్నతాధికారులు ఇద్దరూ తమ సిబ్బందితో ఘటనా ప్రాంతానికి వెళ్లారు. మహా కుంభమేళాలో భాగంగా మౌని అమావాస్య రోజు జరిగే రెండో అమృత స్నానాల కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడమే తొక్కిసలాటకు కారణమని తేలడంతో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడంపై వారు దృష్టిసారించారు.


మహా కుంభమేళాలో భాగంగా మొత్తం నాలుగు అమృత స్నానాలు ఉంటాయి. ఇప్పటివరకు రెండు అమృత స్నానాలు ముగిశాయి. బుధవారం



మౌని అమావాస్య సందర్భంగా రెండో అమృత స్నానాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అంచనాలకు మించి భారీగా తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఫిబ్రవరి 3న వసంత పంచమి సందర్భంగా మూడో అమృత స్నానాలు జరగనున్నాయి. ఆ రోజు కూడా భక్తులు భారీగా అమృత స్నానాలకు తరలివచ్చే అవకాశం ఉంది. దాంతో మళ్లీ తొక్కిసలాట లాంటి దుర్ఘటన పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. భద్రతను కూడా మరింత కట్టుదిట్టం చేశారు. కాగా బుధవారం తెల్లవారుజామున 1-2 గంటల మధ్య మౌని అమావాస్య సందర్భంగా భక్తులు అమృత స్నానాల కోసం భారీగా తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 40 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 60 మంది గాయాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

# ట్రంప్ విధానాలతో ప్రపంచ వ్యవహారాల్లో గణనీయమైన మార్పులు

- దేశ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం
- విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయవాది అని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అభివర్ణించారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ట్రంప్ విధానాలు గణనీయమైన మార్పు తీసుకురావొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన హన్సరాజ్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

"ఇటీవల జరిగిన ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి నేను హాజరయ్యాను. మనకు ఎంతో గౌరవం లభించింది. ఆయనొక జాతీయవాది అని నేను విశ్వసిస్తున్నాను" అని జై శంకర్ అన్నారు. ట్రంప్ భారత్‌కు మిత్రుడా..? శత్రువా..? అని అడిగిన ప్రశ్నకు పైవిధంగా బదులిచ్చారు. ట్రంప్ విధానాలతో ప్రపంచ వ్యవహారాల్లో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశాలున్నప్పటికీ.. భారత్ మాత్రం దేశ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. "అమెరికాతో మన బంధం బలంగా ఉంది. ప్రధాని మోదీకి ట్రంప్‌తో మంచి స్నేహముంది" అని వెల్లడించారు.

ప్రపంచ వ్యాప్తంగా భారత్ ప్రభావం పెరుగుతోందన్నారు. "కొందరు భారతీయేతరులు తమను తాము భారతీయులుగా చెప్తున్నారు. విమానంలోనో, ఇంకోచోటో తమకు సీటు దక్కేందుకు అది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు" అని అన్నారు. అలాగే మంత్రి తన కెరీర్ గురించి మాట్లాడారు. "నేను ఒక బ్యూరోక్రాట్ అవుతానని అనుకోలేదు. నా రాజకీయ ప్రవేశం అనూహ్యంగా జరిగింది. అది అదృష్టమే అనుకోండి. అదంతా మోదీజీ వల్లే. నో అని చెప్పలేని విధంగా నేను రాజకీయాల్లోకి వచ్చేలా ఆయన ప్రోత్సహించారు" అని గుర్తు చేసుకున్నారు.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారానికి భారత్ తరపున విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కో రూబియోతో ఆయన భేటీ అయ్యారు. అగ్రరాజ్య విదేశాంగ మంత్రిగా రూబియో బాధ్యతలు స్వీకరించిన గంట లోపే ఈ సమావేశం జరగడం గమనార్హం. దాదాపు గంటకు పైగా వీరిద్దరూ భేటీ అయ్యారు. భారత్ – అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతమయ్యే దిశగా పలు అంశాలపై వీరు చర్చలు జరిపారు. ట్రంప్ తన రెండో హయాంలో భారత్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కన్పిస్తోంది. ఈక్రమంలోనే విదేశాంగ మంత్రుల భేటీ జరిగింది.



# ఓటమి భయంతోనే ఆప్ దిగజారుడు రాజకీయాలు

- కేజ్రీవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫైర్

న్యూఢిల్లీ: వచ్చే నెల 5న జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఆప్ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని ఆ పారీ అధినేత కేజ్రీవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫైర్ అయ్యారు. ఎన్నికల్లో గెలిచేందుకే ఆప్ అధినేత కేజ్రీవాల్ యమునా నదిలో బీజేపీ విషం కలిపిందని ఆరోపణలు చేస్తున్నారని అమిత్ షా మండిపడ్డారు. గురువారం ఢిల్లీ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఆప్ పాలనలో యమునా నది కలుషితమైపోయిందని.. ఢిల్లీ ప్రజలతో మురికినీటిని తాగిస్తోందని విమర్శించారు. ఢిల్లీ ఎన్నికల్లో ఓడిపోతామని కేజ్రీవాల్ గ్రహించారని.. అందుకే చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీలో ఆప్ పాలనను తరిమికొట్టేందుకు ఫిబ్రవరి 5 ఒక మంచి అవకాశమని పేర్కొన్న ఆయన.. ఆరోజు బీజేపీకి ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. తాము అధికారంలోకి వస్తే ఢిల్లీని నంబర్ వన్ రాజధానిగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

# అత్యాచారం కేసులో కాంగ్రెస్ ఎంపీ అరెస్ట్

లక్నో: ఓ మహిళపై అత్యాచారం కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాకేశ్ రాథోడ్ అరెస్టయ్యారు. బుధవారం రాకేశ్ అలహాబాద్ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. పోలీసుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. అంతకుముందు సీతాపూర్‌లోని ఎంపీ, ఎమ్మెల్యే కోర్టులో కూడా రాకేశ్ ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేశారు. అక్కడ కూడా ఆయనకు నిరాశే ఎదురైంది.



అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు రాకేశ్ రాథోడ్ గురువారం ఉదయం పోలీసుల ముందు లొంగిపోయారు. దాంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. రాకేశ్ రాథోడ్ గత లోక్‌సభ ఎన్నికల్లో సీతాపూర్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా గెలిచారు. ఈక్రమంలో రాకేశ్ రాథోడ్.. పెళ్లి చేసుకుంటానని, రాజకీయ భవిష్యత్తు ఇస్తానని మాయ మాటలు చెప్పి గత నాలుగేళ్లుగా తనపై అత్యాచారానికి పాల్పడుతున్నాడని బాధితురాలు ఈ నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంపీ రాకేశ్ రాథోడ్‌కు, తనకు మధ్య ఫోన్ కాల్ వివరాలను, కాల్ రికార్డింగులను కూడా ఆమె పోలీసులకు అందజేశారు. పోలీసులు ఎంపీపై కేసు నమోదు చేశారు. దాంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం ఈనెల 23న ఎంపీ ఎమ్మెల్యే కోర్టును, బుధవారం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ దొరకకపోవడంతో పోలీసుల ఎదుట లొంగిపోయారు. గత వారం బాధితురాలి భర్త కూడా పోలీసులకు మరో ఫిర్యాదు చేశారు. కేసును వాపస్ తీసుకోవాలని ఎంపీ, ఆయన కుమారుడు ఒత్తిడి చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# నేటి నుండి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో కేంద్రమంత్రులు, పలు పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ఈసందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రం అఖిలపక్షానికి అందించింది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు కూడా ఉంది.

బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటుకు తీసుకురానున్నట్లు కేంద్రం తెలిపింది. దీంతోపాటు మొత్తం 16 బిల్లులను సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. ఆ జాబితాను అఖిలపక్షం ముందు ఉంచింది. వక్ఫ్ చట్ట సవరణపై గతంలో కేంద్రం జేపీసీని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే.

ఇదిలావుండగా వక్ఫ్ చట్టంలో మార్పుల పరిశీలన కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ ఇటీవల సవరణ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించింది. దానికి సంబంధించిన తుది నివేదికను సిద్ధం చేసి తాజాగా లోక్‌సభ స్పీకర్‌కు అందించింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. అయితే, ఈ సవరణలపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. ముస్లింలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని, వక్ఫ్ బోర్డుల పనితీరులో జోక్యం చేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశమని విపక్ష సభ్యులు ఆరోపించారు.



# యూఎస్‌లో ఘోర ప్రమాదం

- విమానాన్ని ఢీకొట్టిన హెలీకాప్టర్
- ప్రయాణికులు బతికే అవకాశం లేదంటున్న అధికార్లు
- 64మందిలో 28 మృతదేహాలు లభ్యం
- 24ఏళ్లలో ఇదే పెద్ద ప్రమాదమంటున్న అధికార్లు
- కొనసాగుతున్న గాలింపు చర్యలు

అమెరికాలోని వాషింగ్టన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 64మందితో వెళ్తున్న ప్రయాణికుల విమానం.. మరో హెలికాప్టర్ పరస్పరం ఢీకొన్నాయి. ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా ప్రమాదం సంభవించింది. దీంతో రెండూ పక్కనేవున్న పోటోమాక్ నదిలో కూలిపోయాయి. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. విమానంలోని మొత్తం 64మంది ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని అక్కడి అగ్నిమాపక శాఖ చీఫ్ వెల్లడించారు. ఇప్పటివరకు 28 మృతదేహాలను నదిలోంచి బయటకి తీసినట్టు తెలిపారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, విమానంలో ఉన్న వారెవరూ ప్రాణాలతో బయటపడే అవకాశం లేదని స్పష్టం చేశారు. గత 24 ఏళ్లలో అమెరికాలో ఇదే అతిపెద్ద ప్రమాదమన్నారు. విమానం తలకిందులుగా నది అడుగుభాగంలో కూరుకుపోయిందని, అక్కడికి దగ్గర్లోనే హెలికాప్టర్ శకలాలను కూడా గుర్తించామని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న జాన్ డొన్నెలీ తెలిపారు.

పీఎస్‌ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం కాన్సాస్‌లోని విషిటానుంచి బయల్దేరింది. వాషింగ్టన్ సమీపంలోని రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్వేపై దిగేందుకు సిద్ధమవుతుండగా.. రక్షణ శాఖకు చెందిన సికోర్‌స్కీ హెచ్-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది గగనతలంలో చోటుచేసుకున్న ప్రమాదంతో భారీ శబ్దం వినిపించింది.

ప్రమాద ఘటనపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "విమానాశ్రయానికి వెళ్లే దారిలో విమానం సరైన దిశలో ఉంది. కానీ హెలికాప్టర్ చాలాసేపు నేరుగా విమానంవైపు వెళ్లింది. ఆకాశం నిర్మలంగా ఉంది. విమానం లైట్లన్నీ వెలుగుతున్నాయి. కానీ హెలికాప్టర్ కిందికో, మీదికో, పక్కకో ఎందుకు వెళ్లలేదు. విమానాన్ని చూశారా? అని అడిగే బదులు ఏంచేయాలో కంట్రోల్ రూంలోని సిబ్బంది ఎందుకు చెప్పలేదు? ఇది పూర్తిగా నివారించదగ్గ ప్రమాదం. ఇలా జరగడం ఏమాత్రం సరిగా లేదు" అని ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు.

విమానం ల్యాండింగ్‌కు ఏటీసీ క్లియరెన్స్ ఇవ్వగా.. సరిగ్గా అదే సమయానికి మిలిటరీ హెలికాప్టర్ ఆ మార్గంలోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్.. హెలికాప్టర్‌కు సమాచారమిచ్చారు. 'మీ ముందు విమానం వస్తోంది కన్పిస్తుందా?' అని అడిగారు. కొన్ని క్షణాల్లోనే మరో రేడియో కాల్‌ను పంపించారు. తర్వాత కేవలం 30 సెకన్లలోపే రెండూ ఢీకొన్నట్లు శబ్దం వినిపించింది.

సునీతా విలియమ్స్..

# మళ్లీ.. స్పేస్ వాక్

సాంకేతిక సమస్యల కారణంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన సునీత విలియమ్స్ మరోసారి స్పేస్‌వాక్ నిర్వహించారు. ఎనిమిది నెలల తర్వాత రెండోసారి ఆమె కేంద్రం వెలుపలకు వచ్చారు. మరో వ్యోమగామి విల్మార్, సునీతా శూన్యంలో వాక్ చేశారు. సునీత విలియమ్స్, విల్మార్లు ఎనిమిది రోజుల మిషన్‌లో భాగంగా గతేడాది జూన్ 6న బోయింగ్ స్టార్లైనర్ క్యాప్సుల్లో 'ఐఎస్ఎస్'కు వెళ్లిన సంగతి తెలిసిందే. అదేనెల 14న వారు తిరిగి భూమికి రావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలు ఎదురవ్వడంతో అక్కడే చిక్కుకుపోయారు. ప్రస్తుతం స్టేషన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్న ఆమె.. నాసాకు చెందిన మరో వ్యోమగామితో కలిసి ఐఎస్ఎస్‌కు సంబంధించి కొన్ని మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. 2012లో ఆమె చివరిసారి స్పేస్‌వాక్ నిర్వహించగా.. ఇటీవల ఆమె ఎనిమిదోసారి వాక్ చేశారు. తాజాగా మరోసారి స్పేస్ వాక్ చేశారు. సునీతా ప్రస్తుతం మూడో రోదసి యాత్రలో ఉన్నారు. గతంలో 2006, 2012లో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. 2012 నాటికి ఏడు స్పేస్ వాక్‌లు నిర్వహించి.. మొత్తం 50 గంటల 40 నిమిషాలపాటు అంతరిక్షంలో ఉన్నారు. ఈ ఏడాది మార్చి చివర్లో లేదా ఏప్రిల్లో భూమికి తిరుగు ప్రయాణమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.



# కాల్పుల విరమణపై కొర్రీ

గాజా కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా సాగుతున్న క్రమంలో ఇజ్రాయెల్ కీలక ప్రకటన చేసింది. గురువారం విడుదల చేయాల్సిన బందీలను దేశంనుంచి పంపించకూడదని నిర్ణయం తీసుకుంది. మిగతా ఇజ్రాయెలీ బందీలను సురక్షితంగా అప్పగిస్తామని హమాస్ స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు విడుదల చేసే ప్రసక్తే లేదని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. ఈమేరకు ప్రధాని కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఒప్పందం ప్రకారం.. గురువారం ఇజ్రాయెల్‌కు చెందిన ఎనిమిది మంది బందీలని హమాస్ విడుదల చేసింది. ప్రతిగా ఇజ్రాయెల్ 110 పాలస్తీనా బందీలను అప్పగించాల్సి ఉంది. కానీ, నెతన్యాహు అందుకు నిరాకరించారు. హమాస్ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై హమాస్ స్పందించింది. మధ్యవర్తుల బృందం ఇజ్రాయెల్ ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతోందని తెలిపింది. కాల్పుల విరమణ ప్రారంభమైన తొలి రోజు ముగ్గురు మహిళా బందీలను హమాస్.. వందకు పైగా పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడిచిపెట్టిన సంగతి తెలిసిందే. 42 రోజుల తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందంలో తమ చెరలోని 94మంది బందీల్లో 33మందిని హమాస్ విడుదల చేయనుంది. ప్రతిగా దాదాపు 1700 మందికి పైగా పాలస్తీనియులకు తమ జైళ్ల నుంచి ఇజ్రాయెల్ విముక్తి కల్పించనుంది.



ప్రజలకు జపాన్ అభ్యర్థన

# ప్లీజ్.. నీళ్లు వాడొద్దు

ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడేందుకు తమ ప్రజలకు జపాన్ అధికారులు ఓ అభ్యర్థన చేశారు. నీరు తక్కువగా వాడమని యోషియో ప్రాంతంలోని 12లక్షల మందిని కోరారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? జపాన్‌లోని యాషియో ప్రాంతంలో భూమికుంగడంతో ఒక భారీగుంత ఏర్పడింది. దాంతో ట్రక్కుతో సహా డ్రైవర్ కూడా అందులో పడిపోయాడు. మంగళవారం ఘటన జరగ్గా.. అతడిని కాపాడేందుకు సహాయక చర్యలు జరుగుతున్నాయి. ఆ గుంత పక్కన భూభాగమంతా గుల్లగా ఉండటంతో సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి. పక్కనే మరో గుంత ఏర్పడింది. మురుగునీరు పైప్ పగిలిపోవడంతో భూమికుంగి ఈ పరిస్థితి తలెత్తిన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ట్రక్కును బయటకు తీసినప్పటికీ.. క్యాబిన్, డ్రైవర్ అందులోనే ఉండిపోయారు. "ఇక్కడ వ్యక్తి ప్రాణాలు కాపాడటమే మా ప్రాధాన్యత. స్నానం, లాండ్రీవంటి అత్యవసరంకాని పనులకు దూరంగా ఉండాలని, సాధ్యమైనంతవరకు తక్కువ నీటిని ఉపయోగించాలనీ ప్రజలను కోరుతున్నాం. సహాయక చర్యలకు అంతరాయం కలుగుతున్నందున మురుగునీటి వ్యవస్థను పునరుద్ధరించడానికి సమయం పడుతుంది" అని అధికారులు వెల్లడించారు. కొద్దిగంటలుగా 74 ఏళ్ల డ్రైవర్ నుంచి ఎలాంటి స్పందన లేదని తెలిపారు. భూమి వదులుగా ఉండటంతో భారీ మెషినరీని ఉపయోగించడం సాధ్యం కావడంలేదని, అయితే అతడిని రక్షించేందుకు సిబ్బంది నిర్విరామంగా పనిచేస్తున్నారని చెప్పారు.

# భారత్‌పై వీసా ఎఫెక్ట్!?

విద్యార్థి వీసాల గడువు ముగిసినా అమెరికాలోనే అక్రమంగా ఉంటున్నవారిపై ఇప్పుడా దేశం దృష్టిపెట్టింది. తాజాగా అమెరికాలో 'వలస చట్టాల అమలును పునరుద్ధరించడంపై హౌస్ కమిటీ విచారణ చేపట్టింది. ఈసందర్భంగా చట్టసభ సభ్యులు పలు సూచనలు చేశారు. 2023లో వీసా గడువు ముగిసినా.. 7వేలమంది భారతీయ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు చాలాకాలం అమెరికాలోనే ఉండిపోయారని సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్‌కు చెందిన జెస్సికా ఎం వాఘన్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. కనీసం 32 దేశాలకు చెందిన విద్యార్థులు, స్టూడెంట్ ఎక్స్ఛేంజి విజిటర్లలో 20శాతానికిపైగా వీసా గడువు దాటినా అమెరికాలోనే ఉంటున్నారని పేర్కొన్నారు. ఎఫ్, ఎం కేటగిరీల్లో వీసాలు పొందినవారే అత్యధికంగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. అమెరికా స్కూల్స్, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పూర్తిస్థాయి విద్యార్థిలా చదువుకొనేందుకు ఎఫ్-1 వీసాలు జారీ చేస్తారు. దీంతోపాటు సెమినార్లు, భాషపై

**అమెరికా విద్యార్థి వీసాలో మార్పులు**




శిక్షణలకు కూడా వాడతారు. ఇక ఎం-1 వీసాలను వృత్తివిద్యా కోర్సులు, నాన్ అకడమిక్ అవసరాలకు, లాంగ్వేజ్ ట్రైనింగ్‌కు వాడుతుంటారు.

"బ్రెజిల్, చైనా, కొలంబియా, ఇండియాల్లో ఒక్కో దానికి చెందిన 2వేలమందికి పైగా విద్యార్థులు వీసా గడువు ముగిసినా ఇంకా అమెరికాలోనే ఉన్నారు. వీరిలో అత్యధికంగా భారతీయుల సంఖ్య 7వేలు. వీసా పాలసీల్లో మార్పులు అవసరం. మారుమూల ప్రాంతాల్లో కూడా అక్రమ వలసదారులను గుర్తించి వెనక్కి పంపేలా ఇంటీరియర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానాన్ని బలోపేతం చేయాలి. చట్టంలో కాంగ్రెస్ పలు సవరణలు చేయాలి. ద్వంద్వ ఉద్దేశాలను విద్యార్థి వీసాలకు వర్తింపజేయకూడదు. దీంతోపాటు ప్రతి స్టూడెంట్ చదువు పూర్తయిన తర్వాత స్వదేశానికి వెళ్లటానికి సిద్ధంగా ఉండాలి" అని జెస్సికా ఎం వాఘన్ పేర్కొన్నారు.

ఇక హెచ్-1బీ వీసాలకు రెండేళ్ల గడువు మాత్రమే ఉండాలని జెస్సికా పేర్కొన్నారు. వీటిని అవసరాన్నిబట్టి నాలుగేళ్లకు పొడిగించుకొనేలా అవకాశం ఇవ్వాలన్నారు. గ్రీన్‌కార్డు పిటిషన్ల ఆధారంగా ఆటోమేటిక్‌గా పొడిగింపులు లభించకూడదని కమిటీకి సూచించారు. 'రీసెర్చి, నాన్ ప్రాఫిట్ సహ వీసాల సంఖ్య 75వేలలోపే ఉండాలి. ప్రస్తుతం అపరిమితంగా ఉంది. ఒకవేళ వీసా సబ్‌స్క్రిప్షన్లు ఎక్కువగా ఉంటే.. అత్యధికంగా వేతనాలు చెల్లించే సంస్థకు కేటాయించారు. ఇలా చేయడంవల్ల ఎక్కువ ప్రతిభ ఉన్నవారికి అవకాశం లభిస్తుంది. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగులుగా చాలా పరిమిత సంఖ్యలో.. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే వీసాలు కేటాయించాలి" అని ఆమె సూచించారు. అమెరికాలో ఉద్యోగులకు కొదవ లేదని జెస్సికా పేర్కొన్నారు. ఒక్క స్టెమ్ డిగ్రీలు పూర్తిచేసి.. ఆయా రంగల్లో పనిచేయకుండా.. లేదా ఉద్యోగాలకు దూరంగా ఉన్నవారి సంఖ్యే 20 లక్షలుందని గుర్తుచేశారు.

# ఆ ఫుట్‌బాల్ క్లబ్‌కు బిలియన్ యూరోలు వార్షిక ఆదాయం!

## - రియల్ మాడ్రిడ్ నయా రికార్డు

ఫుట్‌బాల్ జట్టు రియల్ మాడ్రిడ్ రికార్డు సృష్టించింది. సుమారు బిలియన్ యూరోల (దాదాపు 10వేల కోట్ల రూపాయిలు) కంటే ఎక్కువ వార్షిక ఆదాయాన్ని నమోదు చేసిన మొదటి సాకర్ క్లబ్‌గా అవతరించింది. టాప్ 20 క్లబ్‌లు తొమ్మిది శాతం ఆదాయాన్ని పెంచుకున్నాయని డెలాయిట్ ఫుట్‌బాల్ మనీ లీగ్ వెల్లడించింది.

2023-2024 సీజన్‌లో స్పానిష్ లీగ్(లాలిగా) టైటిల్‌ను రియల్ మాడ్రిస్ కైవసం చేసుకుంది. అలాగే 2023-24 సీజన్‌లో ఛాంపియన్స్ లీగ్ ట్రోఫీని కూడా దక్కించుకుంది. శాంటియాగో బెర్నాబ్యూ స్టేడియంలో రియల్ మాడ్రిడ్ మ్యాచ్ డే ఆదాయంలో భారీగా పెరుగుదల కనిపించింది.

తొలి ఐదు స్థానాల్లో ఇవే

కాగా, ఆదాయంలో రియల్ మాడ్రిడ్ అగ్రస్థానంలో ఉండగా, మాంచెస్టర్ సిటీ 708 మిలియన్ యూరోల ఆదాయంతో రెండో స్థానంలో నిలిచింది. మాంచెస్టర్ సిటీ వరుసగా నాలుగోసారి ప్రీమియర్ లీగ్ టైటిల్, యూరోపియన్ సూపర్ కప్, క్లబ్ వరల్డ్ కప్‌ను గెలుచుకుంది. పారిస్ సెయింట్ జర్మైన్, మాంచెస్టర్ యునైటెడ్, బేయర్న్ మ్యూనిచ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

లాస్ బ్లాంకోస్ మ్యాచ్ డే ఆదాయం 210 మిలియన్ యూరోలు. బార్సిలోనా మ్యాచ్ డే ఆదాయంలో అనూహ్య తగ్గుదల కనిపించింది. ప్రీమియర్ లీగ్ జట్లు వార్షిక ఆదాయ జాబితాలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. బార్సిలోనా, ఆర్సెనల్, లివర్ పూల్, టోటెన్ హామ్ హాట్ స్పర్, చెల్సియా కూడా టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. కాగా, కమర్షియల్ ఆదాయం క్లబ్‌లకు అతిపెద్ద ఆదాయ వనరుగా ఉంది. అయితే అన్ని క్లబ్‌లకు కలిపి బ్రాడ్ కాస్టింగ్ రెవెన్యూ 3.64 బిలియన్ యూరోలు.

"టాప్- 10 మనీ లీగ్ క్లబ్‌ల ఇన్‌కమ్‌పై వాణిజ్య ఆదాయం ఆధిపత్యం చెలాయించింది. అయితే కొన్ని జట్లకు బ్రాడ్ కాస్టింగ్ ఆదాయం కీలకంగా ఉంది. భవిష్యత్తులో పోటీ మరింత పెరుగుతుంది. మరిన్ని ప్రసార, మ్యాచ్ డే ఆదాయాలు వస్తాయి. ఇవి ఫుట్‌బాల్ క్లబ్‌లకు సంపాదన సామర్థ్యాన్ని మరింత పెంచుతాయి." అని డెలాయిట్ స్పోర్ట్స్ బిజినెస్ గ్రూప్ ప్రధాన భాగస్వామి టిమ్ బ్రిడ్జ్ తెలిపారు.



**ఆదాయంలో టాప్-10లో ఉన్న ఫుట్‌బాల్ జట్లు ఇవే!**

*రియల్ మాడ్రిడ్(1,045.5 మిలియన్ యూరోలు)*
*మాంచెస్టర్ సిటీ(837.8 మిలియన్ యూరోలు)*
*పారిస్ సెయింట్ జర్మైన్(805.9 మిలియన్ యూరోలు)*
*మాంచెస్టర్ యునైటెడ్ (770.6 మిలియన్ యూరోలు)*
*బేయర్న్ మ్యూనిచ్(765.4 మిలియన్ యూరోలు)*
*బార్సిలోనా(760.3 మిలియన్ యూరోలు)*
*ఆర్సెనల్ (716.5 మిలియన్ యూరోలు)*
*లివర్ పూల్(714.7 మిలియన్ యూరోలు)*
*టోటెన్ హామ్ హాట్స్ పర్(615.0 మిలియన్ యూరోలు)*
*చెల్సియా(545.5 మిలియన్ యూరోలు)*




# ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభ వేడుకల వివరాలు..

## - గెస్ట్‌గా రోహిత్!

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభ వేడుకల షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 19 నుంచి పాకిస్థాన్ వేదికగా హైబ్రిడ్ మోడల్‌లో ఈ మెగా టోర్నీ జరగనున్న విషయం తెలిసిందే. భారత మ్యాచ్‌లు తటస్థ వేదికైన దుబాయ్ వేదికగా జరగనున్నాయి. అయితే ఈ టోర్నీ కోసం స్టేడియాల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు.. ఆ పనులను ఇంకా పూర్తి చేయలేదని ప్రచారం జరుగుతోంది.

మరోవైపు ఈ ట్రోఫీ ప్రారంభ వేడుకలకు సంబంధించిన షెడ్యూల్‌ను పీసీబీ ఆమోదించినట్లు అక్కడి మీడియా పేర్కొంది. ఫిబ్రవరి 16న లాహోర్ వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభ వేడుకలు జరిగే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా ఉన్న క్రికెట్ బోర్డుల ప్రతినిధులతో పాటు క్రికెట్ దిగ్గజాలు, సెలబ్రిటీలు, ప్రభుత్వ అధికారులు, టోర్నీలో పాల్గొనే 8 జట్ల సారథులు అతిథులుగా ఈ ఆరంభ వేడుకల్లో పాల్గొననున్నారు.

ఈ వేడుకల్లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పాల్గొనడంపై ఇంకా క్లారిటీ లేదు. రోహిత్ పాల్గొనే విషయంపై ఇటు బీసీసీఐ.. అటు ఐసీసీ, పీసీబీ కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఫిబ్రవరి 16న టోర్నీలో పాల్గొన 8 జట్ల కెప్టెన్ల ప్రెస్ కాన్ఫరెన్స్‌లతో పాటు ఫొటో షూట్ నిర్వహించనున్నారు. తొలి మ్యాచ్ ఆతిథ్య పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య కరాచీ వేదికగా జరగనుంది. ఐసీసీ డెడ్‌లైన్‌లోపు స్టేడియాల ఆధునీకరణ పనులను పూర్తి చేయాలని పీసీబీ ప్రయత్నిస్తోంది.

మరోవైపు ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఆరంభ వేడుకలను రద్దు చేసినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. ఆరంభ వేడుకలతో పాటు బరిలో నిలిచే 8 జట్ల కెప్టెన్ల ఫొటో సెషన్, ప్రెస్ కాన్ఫరెన్స్‌లను రద్దు చేసినట్లు పీసీబీ వర్గాలు పేర్కొన్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ టోర్నీలో బరిలో నిలిచే జట్లు ఆలస్యంగా పాకిస్థాన్‌కు వస్తుండటంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

ఛాంపియన్స్ ట్రోఫీలో బరిలోకి దిగి ఆయా దేశాలు తమ జట్లను ప్రకటించాయి. కానీ పాకిస్థాన్ మాత్రం ఇప్పటివరకు తమ జట్టును వెల్లడించలేదు. ఐసీసీ ఇచ్చిన గడువు ముగిసినా.. పాక్ జట్టు ప్రకటించకపోవడం విస్మయపరుస్తోంది.

### శ్రీలంక-ఆస్ట్రేలియా టెస్ట్ మ్యాచ్..

# డబుల్ సెంచరీతో చరిత్ర సృష్టించిన ఉస్మాన్ ఖవాజా!

ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా చరిత్ర సృష్టించాడు. శ్రీలంక గడ్డపై డబుల్ సెంచరీ సాధించిన తొలి ఆసీస్ ప్లేయర్‌గా చరిత్రకెక్కాడు. గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో ఉస్మాన్ ఖవాజా 290 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించాడు. తన కెరీర్‌లో ఉస్మాన్ ఖవాజాకు ఇదే తొలి డబుల్ సెంచరీ కావడం విశేషం.

147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ఆసీస్ బ్యాటర్ శ్రీలంక గడ్డపై డబుల్ సెంచరీ చేయలేదు. కోలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో జస్టిన్ లాంగర్ 166 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు ఇదే అత్యధిక స్కోర్ కాగా.. తాజాగా ఉస్మాన్ ఖవాజా అధిగమించాడు. శ్రీలంక గడ్డపై అత్యధిక పరుగులు చేసిన ఆసీస్ బ్యాటర్ల జాబితాలో ఉస్మాన్ ఖవాజా, జస్టిన్ లాంగ్(166), డామిన్ మార్టిన్(161), డారెన్ లెహ్‌మన్(153), స్టీవ్ స్మిత్(145)లు ఉన్నారు.

తాజా మ్యాచ్‌లో ఉస్మాన్ ఖవాజా డబుల్ సెంచరీకి తోడుగా స్టీవ్ స్మిత్(141) సెంచరీతో చెలరేగాడు. జోష్ ఇంగ్లీస్ హాఫ్ సెంచరీతో రాణించడంతో ఆసీస్ ఇప్పటికే 527 పరుగుల భారీ స్కోర్ చేసింది.

ఇదే మ్యాచ్‌లో స్మిత్ 35వ శతకం నమోదు చేయడంతో పాటు 10 వేల పరుగుల మైలురాయి అందుకున్న విషయం తెలిసిందే. దాంతో అతను తన పేరిట పలు రికార్డ్‌లను లిఖించుకున్నాడు. ఆసీస్ తరపున 35 శతకాలు నమోదు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అతని కంటే ముందు రికీ పాంటింగ్ ఈ ఘనతను అందుకున్నాడు.

అంతేకాకుండా టెస్ట్‌ల్లో 10వేల పరుగుల మైలురాయి అందుకున్న నాలుగో ఆసీస్ బ్యాటర్‌గా.. 15వ అంతర్జాతీయ క్రికెటర్‌గా స్మిత్ నిలిచాడు. గత 14 ఏళ్లుగా ఆసీస్.. శ్రీలంక గడ్డపై టెస్ట్ సిరీస్ గెలవలేదు. ఈ సారి ఆ ముచ్చట తీర్చుకోవాలనే ఆశతో ఉంది. ఇప్పటికే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరిన ఆసీస్.. శ్రీలంకను కూడా ఓడించాలనే పట్టుదలతో ఉంది. ఈ సిరీస్‌కు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ దూరం కాగా.. స్మిత్ జట్టును నడిపిస్తున్నాడు.



# స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్‌పై రికీ పాంటింగ్ ప్రశంసలు

ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్‌పై ఆ జట్టు మాజీ క్రికెటర్ రికీ పాంటింగ్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ తరం అత్యుత్తమ బ్యాటర్లలో స్మిత్ ఒకడని కొనియాడాడు. ఫ్యాబ్-4 రేసు నుంచి కోహ్లీ తప్పుకున్నాడని తెలిపాడు.

రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో స్టీవ్ స్మిత్ శతకంతో చెలరేగాడు. అంతేకాకుండా టెస్ట్‌ల్లో 10 వేల పరుగుల మైలురాయి అందుకున్నాడు. స్మిత్‌కు ఇది 35వ టెస్ట్ సెంచరీ. దాంతో పలు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు.

ఆసీస్ తరఫున 10 వేల పరుగులు చేసిన నాలుగో బ్యాటర్‌గా.. 15వ అంతర్జాతీయ క్రికెటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలోనే స్మిత్ గురించి మాట్లాడిన రికీ పాంటింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. స్టీవ్ స్మిత్‌తో పాటు జో రూట్, కేన్ విలియమ్సన్‌లు ఈ తరం అత్యుత్తమ బ్యాటర్లని అభిప్రాయపడ్డాడు. ఈ జాబితా నుంచి కోహ్లీ వైదొలగాడని పరోక్షంగా వెల్లడించాడు.

'స్మిత్ ఈ జనరేషన్ బెస్ట్ ప్లేయరా? అంటే కాదని వాదించలేం. జో రూట్ కూడా మరో అత్యుత్తమ బ్యాటర్. కేన్ విలియమ్సన్ రికార్డ్ కూడా



బాగుంది. గత రెండేళ్లలోనే జో రూట్ అత్యుత్తమ ఆటగాడిగా నిలబడ్డాడు. ఐదారేళ్ల క్రితం నలుగురు ఆటగాళ్లు అత్యుత్తమంగా ఉన్నారు. ఇందులో కోహ్లీ కూడా ఒకడిగా ఉన్నాడు.

జో రూట్ చివరి స్థానంలో ఉండేవాడు. ఎందుకంటే ఇతర ఆటగాళ్లలా అతను శతకాలు నమోదు చేయలేదు. కానీ గత నాలుగేళ్లలోనే అతను 19 సెంచరీలు నమోదు చేశాడు. ఇంగ్లీష్ అభిమానులను అడిగితే జో రూటే అత్యుత్తమ బ్యాటర్ అంటారు. ఆస్ట్రేలియన్లను అడిగితే స్మిత్ పేరు చెబుతారు. న్యూజిలాండ్ వాళ్లు కేన్ విలియమ్సన్ బెస్ట్ బ్యాటర్ అంటారు.

కాబట్టి ఎవరు అత్యుత్తమ బ్యాటర్ అనేది చెప్పడం కష్టం. కానీ వారి గణంకాలే ఎవరు అత్యుత్తమ బ్యాటర్ అని చెబుతాయి. కాబట్టి స్మిత్ బెస్ట్ బ్యాటర్ కాదని వాదించలేం.'అని రికీ పాంటింగ్ చెప్పాడు.

2020 వరకు తన బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను శాసించిన విరాట్ కోహ్లీ ఆ తర్వాత డీలా పడ్డాడు. 2020 వరకు 27 టెస్ట్ సెంచరీలతో ఫ్యాబ్-4లో విరాట్ కోహ్లీ టాప్‌లో ఉన్నాడు. అతని కంటే స్మిత్ ఒక సెంచరీ వెనుకంజలో ఉండగా.. కేన్ విలియమ్సన్ 6 శతకాలు తక్కువ చేశాడు. జో రూట్ అయితే 10 శతకాల వెనుకంజలో నిలిచాడు. కానీ గత ఐదేళ్లలో జోరూట్ అత్యుత్తమ ప్రదర్శనతో 36 శతకాలతో టాప్‌లో నిలవగా.. స్మిత్ 35 సెంచరీలు, కేన్ విలియమ్సన్ 32 శతకాలతో కోహ్లీ కన్నా ముందంజలో నిలిచారు. ప్రస్తుతం కోహ్లీ 30 శతకాలతో కొనసాగుతున్నాడు. గత నాలుగేళ్లలో కోహ్లీ 3 శతకాలు మాత్రమే నమోదు చేశాడు.



# సల్మాన్ అయితేనే..



సంక్రాంతి సినిమాగా వచ్చి మంచి విజయాన్ని అందుకున్న బాలకృష్ణ చిత్రం –డాకు మహారాజ్. బాలయ్యకు పెయిర్‌గా లీడ్‌రోల్ చేసిన ప్రగ్యా జైస్వాల్ సినిమా విజయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూనే.. చిత్రాన్ని బాలీవుడ్‌లో రీమేక్ చేయాల్సివస్తే హీరో పాత్రకు సల్మాన్ ఖాన్ సెట్ అవుతారన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. 'ఇందులో హీరో పాత్ర విభిన్నం. తప్పకుండా సల్మాన్‌కు నప్పుతుంది. అలాగే, గుర్రపు స్వారీకి సంబంధించిన సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయి. అవి సల్మాన్‌కే సెట్టవుతాయి. 'డాకు మహారాజ్ పాత్రకు సల్మాన్ ప్రాణం పోయగలడు' అని ప్రజ్ఞాజైస్వాల్ అన్నారు.

తాను పోషించిన కావేరి పాత్ర గురించి మాట్లాడుతూ.. "దర్శకుడు బాబీ.. కావేరి రోల్ గురించి చెప్పినప్పుడు సవాలుగా అనిపించింది. కావేరి ప్రెగ్నెంట్ అవుతుందని సినిమాకు సంబంధించిన కొన్ని కీలక యాక్షన్ సన్నివేశాలు నాపై చిత్రీకరిస్తారని తెలిసి ముందు భయపడ్డా. ఆ రోల్‌కు న్యాయం చేయగలనా? లేదా? అని కంగారుగా అనిపించింది. నటిగా ఇదొక అద్భుత అవకాశమని నాకు నేను సమాధానమిచ్చుకున్నా. మునుపెన్నడూ నేను ఇలాంటి పాత్ర పోషించలేదు. అందుకే ఈ సినిమాలో నటించా. ఈ సినిమాలో నాకు అన్ని సన్నివేశాలు ఇష్టమే. ముఖ్యంగా గ్రామం కోసం నేను ఫైట్ చేసే సీన్ నాకెంతో నచ్చుతుంది. ఆ సన్నివేశాన్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటా" అన్నారు.

# నమ్మరుగానీ.. అదే నిజం!



చిత్ర పరిశ్రమలో పరిస్థితిని ఉద్దేశించి నటుడు విశాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. మిగిలిన పరిశ్రమలతో పోలిస్తే ఇక్కడ సక్సెస్ రేటు చాలా తక్కువన్నారు. ఇదే విషయాన్ని తాను గతంలోనూ చెప్పానన్నారు. డబ్బు ఉన్న వాళ్లందరూ సినిమా చేయొచ్చని కాకపోతే లాభాలు అందరికీ వస్తాయనే నమ్మకం లేదన్నారు. "సినీ పరిశ్రమలో ఉండే పరిస్థితుల గురించి గతంలోనూ నేను మాట్లాడాను. అందరూ నన్ను విలన్‌లా చూశారు. ఒక సినిమా తెరకెక్కించాలంటే కనీసం రూ.కోటి నుంచి రూ.4 కోట్ల వరకూ ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. దయచేసి అదే డబ్బును మీ పిల్లల పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయండి. లేదంటే, భూమి కొనుగోలు చేయండి. ఇండస్ట్రీలో పరిస్థితులు ఏమాత్రం బాగా లేవు. ఇలాంటి నిజాలను ఎవరూ బయటకు వచ్చి చెప్పరు. డబ్బున్న వాళ్లెవరైనా సినిమాలు చేయొచ్చు. విజయ్ మాల్యా, అంబానీ కూడా సినిమాలు చేయొచ్చు. వారి వద్ద అంత డబ్బుంది. కానీ వాళ్లెందుకు సినిమాలు నిర్మించడం లేదు. ఎందుకంటే సినీ పరిశ్రమలో సరైన లాభాలు ఉండవని వాళ్లకు తెలుసు" అని విశాల్ అన్నారు. 2024 కోలీవుడ్ చిత్ర పరిశ్రమ తీవ్ర నష్టాలు చవి చూసిందని సినీ విశ్లేషకులు అంచనా వేసిన విషయం తెలిసిందే. గత ఏడాదిలో ఆ ఇండస్ట్రీ సుమారు రూ.1000 కోట్లు నష్టపోయిందని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది తమిళ నిర్మాతలు దాదాపు రూ.3వేల కోట్లతో 241 చిత్రాలను నిర్మించి, విడుదల చేశారు. వాటిలో కేవలం 18 చిత్రాలు మాత్రమే హిట్ అయ్యాయని పేర్కొన్నారు. పరిస్థితులకు అనుగుణంగా దర్శక, నిర్మాతలు ఎంతో మారాలని, కథల ఎంపిక, తెరకెక్కించే విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

# బాలీవుడ్‌కు దక్షిణాది అవసరముంది




ప్రస్తుతం బాలీవుడ్‌కు దక్షిణాది నటీనటుల అవసరముందని వ్యాఖ్యానించారు రెజీనా. "బాలీవుడ్ వాళ్లకు ఇప్పుడు వేరే ఆప్షన్ లేదు. గతంలోనైతే దక్షిణాది తారలకు అక్కడ ఛాన్స్‌లు దొరకడం కష్టంగా ఉండేది. భాషాపరమైన ఇబ్బందులు కూడా ఓ కారణమై ఉండొచ్చు. కానీ, కరోనా తర్వాత ఇండస్ట్రీలో పరిస్థితులు మారాయి. సౌత్ సినీతారలకు ఛాన్స్‌లిస్తున్నారు. తమ చిత్రాలను ఎక్కువమంది ప్రేక్షకుల్లోకి తీసుకువెళ్లడం కోసం దక్షిణాది తారలను ఎంచుకోవడం అవసరంగా మారింది" అన్నారు. ప్రస్తుతం తానొక బాలీవుడ్ ప్రాజెక్టుకు సంతకం చేశానని, త్వరలోనే విశేషాలు చెప్తానన్నారు.

రెజీనా నటించిన తాజా చిత్రం 'విదాముయార్చి'. అజిత్ హీరోగా దర్శకుడు మాగిజ్ తిరుమేని దీనిని రూపొందించారు. త్రిష కథానాయిక. అర్జున్ కీలక పాత్ర పోషించారు. ఇందులో రెజీనా అర్జున్‌కు జోడీగా కనిపించనున్నారు. ఫిబ్రవరి 6న సినిమా విడుదల కానుంది. ఈనేపథ్యంలోనే 'విదాముయార్చి' ప్రమోషన్స్‌లో ఆమె పాల్గొని సినిమా విశేషాలు పంచుకుంటున్నారు. ఇది తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. మాగిజ్ తిరుమేని అద్భుతంగా చిత్రాన్ని రూపొందించారన్నారు. చెప్పారు. సినిమాలో నాది పాజిటివ్ రోల్? లేదా నెగిటివ్ రోల్? అని ఇండస్ట్రీలో మాట్లాడుకోవడం నాకెంతో నచ్చింది" అన్నారు రెజీనా కాసాండ్రా.

# రూ.18కోట్ల ఎపిసోడ్ అది

నాగచైతన్య హీరోగా దర్శకుడు చందూ మొండేటి తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం 'తండేల్. సాయి పల్లవి హీరోయిన్. శ్రీకాకుళం జిల్లా డి మత్స్యలేశం గ్రామంలో చోటుచేసుకున్న సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రమిది. వేటకు వెళ్లిన పలువురు మత్స్యకారులు పాకిస్థాన్ కోస్ట్ గార్డుకు చిక్కి రెండేళ్లు జైలు శిక్ష అనుభవించిన వృత్తాంతాన్ని తెరపైకి తీసుకొస్తున్నారు. సినిమా ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రమోషన్స్‌లో పాల్గొంటూ బిజీగా ఉన్నారు.



**'కార్తికేయ 2' అనుభవంతో..**

"నా గత చిత్రం 'కార్తికేయ 2' అనుభవం 'తండేల్కు బాగా ఉపయోగపడింది. నేనెప్పుడూ అనుకున్న బడ్జెట్‌ను దాటి సినిమా చేయను. ఈ మూవీ విషయానికొస్తే.. రీసెర్చ్ అనంతరం కథ రాయడం పూర్తయింది. తర్వాత హీరో బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటే బాగుంటుందో టెస్ట్ చేసేందుకు మళ్లీ డి. మత్స్యలేశం వెళ్లాం. ఇంకా ఏం జరిగింది? అని అక్కడి వారిని అడగ్గా సముద్రంలో చోటుచేసుకున్న తుపాను, ఆ టైంలో మత్స్యకారులు సమయస్ఫూర్తి గురించి వివరించారు. అప్పటికే పూర్తయిన కథకు తగ్గట్టు బడ్జెట్ ఫిక్స్ అయిపోయినా.. ఇలాంటి విజువల్స్ ఉంటే బాగుంటుందని భావించా. అదే విషయం చెబితే నిర్మాతలు అంగీకరించారు. ఆ ఒక్క ఎపిసోడ్‌కే రూ.18 కోట్లు బడ్జెట్ అయింది. లైవ్ లొకేషన్ (సముద్రం)లో, స్టూడియోలో, మినియేచర్, వర్చువల్ సన్నివేశాలు చిత్రీకరించాం. ఎమోషన్ ఉంటుంది" అన్నారు దర్శకుడు చందు మొండేటి.

# ఇండస్ట్రీలోవున్న మోనాలిసాలను గుర్తించరా?



కుంభమేళా సందర్భంగా సోషల్ మీడియాలో మోనాలిసా అనే యువతి వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమెను ఉద్దేశిస్తూ కంగనా రనౌత్ ఇన్‌స్టాలో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఆమెలాంటి హీరోయిన్లు ఇండస్ట్రీలో చాలామంది ఉన్నారన్నారు. ఫొటోలు, వీడియోల కోసం మోనాలిసాను ఇబ్బంది పెట్టిన తీరు బాధ కలిగించిందన్నారు. "తన సహజ సౌందర్యంతో ఇంటర్నెట్‌లో సంచలనంగా మారిన మోనాలిసాతో ఫొటోలు దిగేందుకు కొందరు ప్రవర్తించిన తీరు బాధించింది. నేను వారిని ద్వేషించడం తప్ప ఏంచేయగలను. ఇండస్ట్రీలో ఆమె రంగులో ఉన్న హీరోయిన్లు ఎంతోమంది ఉన్నారు. వారందరినీ మీరు ఇలానే అభిమానిస్తున్నారా? కాజోల్, దీపికా పదుకొణెవంటి నటీమణులపై చూపిన ప్రేమాభిమానాలే కొత్త హీరోయిన్లపైనా చూపిస్తున్నారా? మోనాలిసాను గుర్తించినట్టు అలాగేవున్న కొత్తవారినీ ఎందుకు గుర్తించరు?" అని కంగనా రనౌత్ తన స్టోరీలో రాసుకొచ్చారు.

